Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 361 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 జనవరి 2024 శనివారం పేజీలు : 4

## అయోధ్యకు సిరిసిల్ల బంగారు చీర!

సిరిసిల్ల : సిరిసిల్లలో రూపుదాల్చిన ప్రత్యేక పట్టు వస్త్రం అయోధ్య రామాలయానికి చేరనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత కళాకారుల దంపతులు యెల్ది హరిప్రసాద్, రేఖ 20 రోజుల పాటు చేనేత మగ్గంపై శ్రమించి బంగారం, వెండితో కలిపి నేసిన పట్టు చీరపై అయోధ్య రామమందిరం, రామాయణ ఘట్టాల ఇతివృత్తాలను ఆవిష్కరించారు. గతంలో హరిప్రసాద్ జీ20 లోగోను వస్త్రంపై రూపొందించి ప్రధాని మోదీకి కానుకగా పం పారు. మన్‌కీబాత్‌లో ఈ విషయాన్ని మోదీ ప్రస్తావిస్తూ హరిప్రసాద్ కృషిని మెచ్చుకున్నారు. ఈనేపథ్యంలోనే ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హరిప్రసాద్ దంపతులను ఆహ్వానించా రు. బంగారు చీరను 26న మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా అయోధ్య రాముడి పాదాల చెంత చీరను ఉంచనున్నారు.



# రేవంత్ దూకుడుకు మోదీ చెక్

## ఎస్సీ వర్గీకరణకు కేంద్రం సై

### కాంగ్రెస్ ఓటుబ్యాంక్ గల్లంతు

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల గడువు సమీపించింది. ఇంకో రెండు నెలల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ ఎన్నికలను ఎదుర్కొనడానికి ముమ్మర కసరత్తు సాగిస్తోన్నాయి. గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికం బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతోంది. నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో మూడింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఏఐఎంఐఎం ఒక స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది బీజేపీ. ఈ క్రమంలో కీలక నిర్ణయాన్ని తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి సంబంధించిన నిర్ణయం అది. కాంగ్రెస్‌కు అండదండగా ఉంటూ వస్తోన్న దళిత సామాజిక వర్గ ఓటుబ్యాంకును ప్రభావితం చేయొచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతుల ను అధ్యయనం చేయడానికి, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిశీలించడానికి ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన అయిదుమంది ఉన్నతాధికారులతో ఆ కమిటీ ఏర్పాటైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా.. ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కేంద్ర న్యాయ, గిరిజన, సామాజిక న్యాయం, డీఓపీటీ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ నెల 23వ తేదీన ఈ కమిటీ తొలి భేటీ ఉంటుంది. ఎస్సీ వర్గీకరణ అంశంపై అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. అది ఇప్పుడు వాస్తవ రూపం దాల్చింది. సుదీర్ఘకాలంగా ఈ డిమాండ్ వినిపిస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. ఎస్సీ వర్గీకరన కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలను నిర్వహించిది. సమితి అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చాలాకాలంగా దీని కోసం పోరాడుతూ వస్తోన్నారు. ఆయన సమక్షంలోనే మోదీ హామీ ఇచ్చారు.

# కొందరిలో ఆత్మత... మరికొందరిలో ఆందోళన!


## నామినేటెడ్ కసరత్తు!!

హైదరాబాద్ : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తొందరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని డిసైడ్ అయ్యింది. పార్టీ గెలుపుకు బాగా కష్టపడిన నేతల పేర్లను జిల్లాల వారీగా రెడీ చేయమని రేవంత్ రెడ్డి నుండి పార్టీలోని ముఖ్య నేతలకు ఆదేశాలు అందినట్లు పార్టీలో టాక్ వినబడుతోంది. కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్ పోస్టులతో పాటు జిల్లాల స్థాయిలో భర్తీకి అవకాశమున్న కార్పొరేషన్లు, వాటిలో డైరెక్టర్ పోస్టులు చాలా ఉన్నాయి. ప్రయారిటీ బేసిస్ ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలన్నది రేవంత్ ఆలోచనగా తెలుస్తోంది. ముందు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లను భర్తీచేసి తర్వాత జిల్లాల స్థాయిలో నియామకాలను పూర్తి చేయాలని అనుకుంటున్నారట. ఈ భర్తీ ప్రక్రియలో కూడా కాంగ్రెస్ కు అత్యధిక సీట్లను అందించిన జిల్లాల వారీగా చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీని ప్రకారం చూస్తే ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని నేతలకే మెజారిటి పదవులు అందే అవకాశాలున్నాయి. ఎందుకంటే కాంగ్రెస్ కు వచ్చిన 64 సీట్లలో పై మూడు జిల్లాలదే మేజర్ పాత్ర కాబట్టి. పై మూడు జిల్లాల్లో బీఆర్ఎస్ దాదాపు తుడిచిపెట్టుకుపోయిందనే చెప్పాలి. ఈ మూడు జిల్లాల నుండి గట్టి దెబ్బ పడటం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చోవాల్సొచ్చింది. అందుకనే మరే జిల్లాకు దక్కనట్లుగా ఖమ్మం జిల్లాకు మూడు మంత్రిపదవులు దక్కాయి. జిల్లాలో పదిసీట్లుంటే కాంగ్రెస్ తొమ్మిది నియోజకవర్గాల్లో గెలిచింది. పదో నియోజకవర్గంలో బీఆర్ఎస్ బొటాబొటిగా గెలిచింది. లేకపోతే పదికి పదీ కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసుండేదే తొందరలోనే జరగబోతున్న పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ స్వీప్ చేయాలని రేవంత్ పట్టుదలగా ఉన్నారు. అది జరగాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడినట్లే నేతలంతా ఏకతాటిపైకి వచ్చి బీఆర్ఎస్, బీజేపీలపై పోరాటం చేయాల్సుంటుంది. ఎలాగూ అధికారంలోనే ఉన్నారు కాబట్టి, నెలరోజుల పాలనలో ప్రజలు కూడా సానుకూలంగా ఉన్నారు కాబట్టి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు అందుకుంటుందనే అనుకుంటున్నారు. అందుకనే పార్లమెంటు ఎన్నికలు అయిపోగానే నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ శ్రీకారం చుట్టబోతున్నారు. అందుకనే ఇపుడు జాబితాలు రెడీ చేయిస్తున్నారు.



## తెలంగాణపై బీజేపీ ఫోకస్.. రంగంలోకి అమిత్ షా

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంపై భారతీయ జనతా పార్టీ దృష్టిసారించింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని అనుకుంటోంది. ఈ నెల 28వ తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర పర్యటన ఖరారయ్యింది. ఒకే రోజు మూడు జిల్లాల్లో అమిత్ షా సుడిగాలి పర్యటన చేయనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కార్యకర్తలతో అమిత్ షా సమావేశం అవుతారు. బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి శ్రేణులతో చర్చిస్తారు. అక్కడి నుంచి నేరుగా మహబూబ్ నగర్ వెళతారు. అక్కడ ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీలతో



అమిత్ షా సమావేశం అవుతారు. అటు నుంచి హైదరాబాద్ వస్తారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులతో అమిత్ షా సమావేశం అవుతారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ సీట్ల సంఖ్యను పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇప్పటికే పార్టీలో చాలా మార్పులు చేపట్టింది. 12 జిల్లా అధ్యక్షులను ఛేంజ్ చేసింది. బీజేపీ మోర్చా అధ్యక్షులను కూడా మార్చింది. కొత్తగా ఆరుగురిని నియమించింది. అధ్యక్షుల మార్పు, మోర్చా అధ్యక్షులను మార్చి.. పార్టీ బలోపేతంపై దృష్టిసారించింది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీ వీలైనన్నీ ఎక్కువ సీట్లు గెలవాలని భావిస్తోంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది.




# పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే...

# ఉచిత కరెంట్!

### మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్న విద్యుత్ అధికారులు!!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తుంది.ఇప్పటివరకు రెండు పథకాలను అమలు చేశారు.ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల భీమాను కల్పించారు.

మిగిలిన పథకాల అమలుపై దృష్టి పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించింది. ఆరోగ్యానికి ఒకే ఫారాన్ని తీసుకొచ్చి ప్రతి గ్రామంలో ప్రజా పాలన ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అందరి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తులను డీజిలైజ్ చేసిన తర్వాత క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను తీసుకుంటారు. లబ్ధిదారుల ఎంపిక తర్వాత మహిళలకు నెలకు రూ.2500, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు వంటి పథకాలను అమలు చేస్తారు. అయితే ఇందులో ఉచిత కరెంటు పథకానికి సంబంధించి కీలక వివరాలు బయటకు వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని తమ మేనిఫెస్టోలో కాంగ్రెస్ తెలిపింది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ పథకం అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఉచిత కరెంటు పథకం వర్తించాలంటే బకాయిలు ఉండకూడదు అని అధికారులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను క్లియర్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడంతో చాలామంది డిసెంబర్, జనవరి బిల్లులు కట్టలేదు. వారంతా పెండింగ్ బిల్లులను కట్టాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. ఎలాంటి బకాయిలు లేని వారికి ఉచిత కరెంట్ వస్తుందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చినందున డిసెంబర్, జనవరి బిల్లులను మాఫీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉచిత కరెంటు పథకానికి సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రజా పాలన దరఖాస్తులు ఎన్ని యూనిట్ల కరెంటు వాడుతారు..మీటర్ కనెక్షన్ నెంబర్ ఎంత..అనే వివరాలు మాత్రమే అడిగారు. గైడ్ లైన్స్ వచ్చిన తర్వాతే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

# సంపాదకీయం

## నోరు తెరిచి అడిగితే అమ్మే కాదు..
## అమిత్ షా ఇస్తారు

అడగకుంటే అమ్మ కూడా అన్నం పెట్టదని అంటారు. అలాంటిది వేర్వేరు భావజాల రాజకీయ పార్టీలు కేంద్ర.. రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే అనుకున్న పనులు అనుకున్నట్లు జరుగుతాయి. ఎవరు అవునన్నా.. కాదన్నా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆశీస్సులు.. సహకారం లేకుంటే ఏ రాష్ట్ర పరిస్థితి అయినా ఇబ్బందికరంగానే ఉంటుంది. రాజకీయాలు ఎన్ని ఉన్నా.. కొన్ని అంశాలకు సంబంధించి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. ఈ విషయంలో మోడీ సర్కారుకు మంచి మార్కులే పడతాయి. అవసరం ఉన్నప్పుడు ఒకలా.. అవసరం తీరిన తర్వాత మరోలా వ్యవహరించే తీరు తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కు ఎక్కువన్న మాట రాజకీయ వర్గాల్లో వినిపిస్తూ ఉంటుంది. ప్రతి అంశంలోనూ తమదే పైచేయి కావాలన్న తీరు ఒక స్థాయి వరకు ఓకే కానీ.. శ్రుతిమించి తీరు వారిలో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుందన్న విమర్శ వినిపిస్తూ ఉంటుంది. పదేళ్ల.. తమ పాలనలో కేంద్రంలోని మోడీ సర్కారు మీద నిత్యం ఏదో విధంగా విరుచుకుపడే తీరు కనిపించటం తెలిసిందే. తమకు కేంద్రం సహకరించటం లేదంటూ కేసీఆర్.. కేటీఆర్ తరచూ విమర్శలు చేసేవారు. అయితే.. అడిగే తీరులో అడగాలే కానీ.. అమిత్ షా సైతం సానుకూలంగా స్పందిస్తారన్న విషయం తాజాగా మరోసారి ప్రూవ్ అయ్యింది. తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్ రెడ్డి.. ఆ మధ్యన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని.. కేంద్ర మంత్రుల్ని సాదరంగా కలవటం.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని వినతుల్ని వారి ముందు ఉంచటం తెలిసిందే. ఉప్పు.. నిప్పులా ఉండే కాంగ్రెస్ పార్టీ.. బీజేపీల మధ్య పంచాయితీ నేపథ్యంలో.. ఢిల్లీకి వెళ్లిన రేవంత్ ఏం సాధిస్తారన్న సందేహాన్ని వ్యక్తం చేశారు పలువురు. అయితే.. అడిగే విధంగా అడిగితే.. అమిత్ షా సైతం ఇస్తారన్న విషయాన్ని ప్రూవ్ చేశారు రేవంత్. తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఐపీఎస్ ల అవసరం ఉందని.. వారిని వెంటనే కేటాయించాలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను అడిగినట్లుగా ఆ మధ్యన ఒక ప్రముఖ చానల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పటం తెలిసిందే. రేవంత్ చేసిన వినతికి తాజాగా కేంద్రం స్పందించింది. జనవరి 4న ఢిల్లీలో అమిత్ షాను కలిసి అదనపు ఐపీఎస్ లు కావాలని అడగటం.. తాజాగా అందుకు తగ్గట్లే అమలు దిశగా అడుగులు పడటం ఆసక్తికరంగా మారింది. జిల్లాల విభజన.. వివిధ శాఖల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్రానికి 29 మంది అదనపు ఐపీఎస్ పోస్టులను కేటాయించాలని కోరారు. రాష్ట్ర విభజన సమయంలో కేవలం 76 మంది ఐపీఎస్ అధికారుల్ని కేటాయించారని.. అదనపు పోస్టులు అవసరమని పేర్కొన్నారు. రేవంత్ వినతికి కేంద్ర మంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. రేవంత్ అడిగినంత మంది ఐపీఎస్‌లను కేటాయించకున్నా.. తాజాగా ఆరుగురు ఐపీఎస్ లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయేషా ఫాతిమా.. మంధారే సోహం సునీల్.. మనన్ భట్.. పత్తిపాక సాయి కిరణ్.. రాహుల్ కాంత్.. రుత్విక్ సాయిలను తెలంగాణ క్యాడర్ కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరంతా 2022 బ్యాచ్ కు చెందిన వారు. ఈ ఏడాది కొత్తగా వచ్చే బ్యాచ్ తో మిగిలిన పోస్టులు భర్తీ చేసే వీలుందని చెబుతున్నారు. ఇదంతా చూస్తే.. అడగాలే కానీ అమ్మ మాత్రమే కాదు అమిత్ షా కూడా అడిగినవి ఇస్తారన్న మాట రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం...

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ గౌతమ్.





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : జిల్లావ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలకు కొరకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తెలియజేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి ఆయా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ...

**జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రకాల చర్యలు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ గౌతమ్-** శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి ఆయా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు, సలహాల ప్రకారం మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికార యంత్రాంగం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి నుంచే అధికారులకు అవసరమైన సూచనలు చేశామని వీడియో కాన్ఫరెన్స్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఫారం%--%6,7,8 లను ఈనెల 22వ తేదీ వరకు పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్లో తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ సంబంధించి కూడా మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లాలోని పార్లమెం ట్ కి సంబందించి ఏడు నియోజకవర్గాలకు కలుపుకొని పూర్తి స్థాయిలో అందచేసేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని అధికారుల ద్వారా అందచేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... అందులో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకొని అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్లో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు, సలహాల ప్రకారం మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికార యంత్రాంగం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి నుంచే అధికారులకు అవసరమైన సూచనలు చేశామని వీడియో కాన్ఫరెన్స్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఫారం%--%6,7,8 లను ఈనెల 22వ తేదీ వరకు పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్లో తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ సంబంధించి కూడా మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లాలోని పార్లమెంట్ కి సంబందించి ఏడు నియోజకవర్గాలకు కలుపుకొని పూర్తి స్థాయిలో అందచేసేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని అధికారుల ద్వారా అందచేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... అందులో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకొని అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్లో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 20, 21వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ దిశగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఓటరు



నమోదుకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కానివారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదుకు, చిరునామా తదితర సవరణల గురించి జిల్లాలో రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ గురించి చేసిన షెడ్యూల్లో ఈ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా సంబందిత ఫారం (6 మరియు 8) లతో ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ నమోదుకు, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పు, సవరణలు ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ కోరారు.

## రజకుల అభివృద్ధికి సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తాను...

### తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్

శామీర్ పేట (గరుడ వార్త): రజకుల అభివృద్ధికి, సంక్షేమానికి ఎల్లవేళల కృషి చేస్తానని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్ పేట లో జరిగిన రజక సంఘ సమావేశంలో రజక సంఘాల చైర్మన్ గా బస్వరాజు శంకర్ ను పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బస్వరాజు



శంకర్ మాట్లాడుతూ... రజక సంఘం అభివృద్ధి, హక్కుల సాధనకై కృషి చేస్తాననీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ చైర్మన్ ఆకరాజ్ శ్రీనివాస్, రజక సంఘం నాయకులు కొన్నే సంపత్, బర్లపాటి జయరాం, కోట్ల శ్రీనివాస్, దుబ్బాక రమేష్, కుమార స్వామి, కనకయ్య, జూపల్లి సాయిలు, జూపల్లి రవి, పంజాగారి ఆంజనేయులు, పోతురాజ్ రాములు, పూసల సంపత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## విశ్వాసనీయతను సంపాదించుకుంటూ అభివృద్ధి సాధించాలి...

### ఐపిఈ కళాశాలలో పి జి డి ఎం పూర్తిచేసిన 443 మంది విద్యార్థులకు పట్టాల పంపిణీ...
### ఉజ్వల ముద్దన మెమోరియల్ గోల్డ్ మెడల్ అందుకున్న విద్యార్థి ఆదిత్య..







శామీర్ పేట, (గరుడ వార్త ) : విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం సేవ చేయడంలో, విధులను నిర్వర్తించడంలో విశ్వాసతను సంపాదించుకుంటూ స్పూర్తిగా నిలువాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు చెప్పారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్ పేట పరిధిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ (ఐపిఈ) కళాశాలలో అధ్యక్షుడు మాధవరావు రిటైర్డ్ ఐఏఎస్ ఆధ్వర్యంలో 2023 స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆర్.బి.ఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు విచ్చేసి అధ్యక్షుడు మాధవరావు, డైరెక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి పి జి డి ఎం విద్యను పూర్తిచేసిన 443 మంది విద్యార్థులకు ఆనందోత్సవాల మధ్య పట్టాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏ పని చేసిన అభివృద్ధితో చేస్తూ పని పట్ల మక్కువ చూపించాలని తెలిపారు. గొప్ప గొప్ప ఫలితాలను సాధించాలని, బాధ్యతగా విధులను నిర్వర్తించాలని చెప్పారు. ఆయన ఆర్బిఐలో పనిచేసిన అనుభవాలను ప్రస్తావిస్తూ విధుల నిర్వహణలో అట్టడుగు స్థాయి వాటాదారులకు అనుసంధానం కావాల్సిన అవసరాన్ని చెబుతూ విద్యార్థులకు హితబోధ చేశారు. విధుల నిర్వహణలో మీ విశ్వాసనీయతను సంపాదించుకున్నట్లయితే అది ఇతరులపై ఎంతగానో ప్రభావం చూపుతుందని, గొప్ప ఫలితాలను సాధించవచ్చు అని తెలిపారు. ఏదైనా ముఖ్యమైనది అయితే దానికోసం అధిక సమయానికి కేటాయించాలని ఆయన చెప్పారు. నేర్చుకోవడం అనేది జీవితకాలం ప్రక్రియ అని, పరస్పర చర్యలు పరిశీలనల ద్వారా నేర్చుకోవడం ఎంతో ఉత్తమమని ఆయన సూచించారు. అలాగే పాత్రల, వ్యక్తిత్వం మధ్య వ్యత్యాసాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మాధవరావు సాగతోపన్యాసం చేయగా కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి అతిథులకు స్వాగతం పలుకుతూ సంస్థ చరిత్ర, వైభవాన్ని, దాని ప్రశంసలను, మేనేజ్మెంట్ విద్య, శిక్షణ, పరిశోధన, కన్సల్టెన్సీ, పరిశ్రమలకు చేరువలో చేసిన సేవలను ఆయన వివరించారు. ఐపిఈ పాత్రను, కేంద్ర, రాష్ట్రస్థాయి పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ తో ఏర్పడిన బలమైన సంబంధాలను ఆయన ప్రసంగంలో చెప్పారు.

**గోల్డ్ మెడల్ అందుకున్న ఆదిత్య...**కాగా ఈ స్నాత కోసంలో ఐపిఈ కళాశాలలో 2023లో పిజిడిఎం కోసం పూర్తిచేసిన విద్యార్థి ఆదిత్యకు ఉజ్వల ముద్దన మెమోరియల్ గోల్డ్ మెడల్ అవార్డును ఆర్బిఐ మాజీ గవర్నర్ సుబ్బారావు, కళాశాల అధ్యక్షుడు మాధవరావుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ లు ప్రొఫెసర్ శ్రీకాంత్, ప్రొఫెసర్ లక్ష్మి కుమారి, కళాశాల ప్రొఫెసర్ ఎం ఎల్ ఎన్ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అయోధ్య రామ మందిరం పై పోస్టల్ స్టాంప్ సంతోషకరం

### తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్..



హైదరాబాద్ : 500 సంవత్సరాల చరిత్ర కలిగిన రామ మందిరాన్ని అయోధ్యలో పునర్మించి ప్రధాని నరేంద్ర మోడీ పోస్టల్ స్టాంప్స్ విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలంగాణ ఉద్యమకారులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం నిర్మించుకోవడం ఎన్నో ఏళ్ల కళ అన్నారు. అయోధ్య లో దేవాలయాన్ని నిర్మించి భారతదేశానికి నిజమైన రామరాజ్య పరిపాలన ప్రధాని నరేంద్ర మోడీ నిరూపించారని కొనియాడారు.

ఈనెల 22వ తేదీన అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని అందరం ఆనందంగా మన ఇండ్లలో దీపాలు వెలిగించి పండుగలా జరుపుకోవా లని పిలుపునిచ్చారు.

## విద్యుత్తు చౌర్యంలో ఇదో రకం!

భువనగిరి : ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యుత్తు చౌర్యం యథేచ్ఛగా కొనసాగుతోంది. రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్తు పక్కదారి పట్టున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ ముషరఫ్ ఫారూఖీ ఇటీవల అధికారులతో క్షేత్రస్థాయిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉచిత వ్యవసాయ విద్యుత్తును వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఉచిత విద్యుత్తు దుర్వినియోగం అవుతుండటంతో సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఉచిత వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు పొందిన పలువురు తమ క్షేత్రాల్లో నిర్మించుకున్న వసతి గృహాలకు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇటీవలి రాజధాని శివారు మండలాలతో పాటు పలు గ్రామాల్లో ఫాంహౌస్ సంస్కృతి గణనీయంగా పెరిగింది. ఫాంహౌస్‌లలో విలాసవంతమైన భవనాలు నిర్మించి కొందరు రోజుల వారీగా అద్దెకు ఇస్తున్నారు. ఆయా భవనాల్లో ఏసీలు, గీజర్లు, ఆకర్షణీయమైన దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫాంహౌజ్ ప్రాంగణంలో రెయిన్ డ్యాన్స్, పాటల ఫ్లోర్‌లను నిర్మించుకున్నారు. ఖరీదైన శునకాలకు, పక్షులకు కేజెస్‌ను నిర్మించి ఏసీతో పాటు దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. కొందరు ఇప్పటికి ఆయా అవసరాల కోసం ఉచిత విద్యుత్తు వినియోగిస్తుండగా, మరి కొందరు నామ్‌కే వాస్తేగా ఒక గృహ, వాణిజ్య కనెక్షన్ తీసుకుని మొక్కుబడిగా బిల్లు చెల్లిస్తున్నారు. ఈ అంశం ఇలా ఉండగా వ్యవసాయ అనుబంధంగా డెయిరీ, పౌల్ట్రీఫాంలకు ఉచిత విద్యుత్తు వినియోగిస్తుండటంతో సంస్థ భారీగా నష్టపోతోంది.

గృహ విద్యుత్తు వినియోగం ఇలా...

గృహ అవసరాలకు కనెక్షన్ తీసుకున్న కొందరు వాటికి అనుబంధంగా ఉన్న వ్యాపారానికి, ఆస్పత్రులకు విద్యుత్తును వినియోగిస్తున్నారు. ఒకే ఇంటి పేరిట నాలుగు నుంచి ఆపైన కనెక్షన్లు తీసుకుని వివిధ విభాగాలకు విద్యుత్తు వినియోగిస్తున్నారు. ఒకటికి ఎక్కువగా మీటర్లు తీసుకుంటూ విద్యుత్తు వినియోగాన్ని విభజించడం ద్వార తక్కువ బిల్లు వచ్చేలా జాగ్రత్త పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత కొన్నేళ్ళుగా పుంజుకున్న స్థిరాస్తి వ్యాపారం. పరిశ్రమల ఏర్పాటు, ఏటేటా విస్తరిస్తున్న వాణిజ్యం, వ్యాపారం, హొటళ్లు, అతిథి గృహాల నిర్మాణలతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించి కేటగిరీల వారీగా కనెక్షన్ల లెక్క తేల్చితే విద్యుత్తు చౌర్యానికి అడ్డుకట్ట పడటంతో పాటు సంస్థ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

చర్యలు ఇలా...విద్యుత్తు చౌర్యంతో ప్రతి ఏటా విద్యుత్తు సంస్థ భారీగా నష్టపోతుంది. నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టని కారణంగా క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికి వ్యవసాయ అక్రమ విద్యుత్ వినియోగంపై నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఒక్క కనెక్షన్‌కు కూడా కేటగిరీ మార్చకపోవడం గమనార్హం. ఆవాస ప్రాంతాల్లో కొనసాగుతున్న విద్యుత్తు చౌర్యంతో సంస్థ భారీగా నష్టాలను మూట గట్టుకోవాల్సి వస్తుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో వ్యవసాయ కనెక్షన్ ద్వార వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్తుపై ఇప్పటి వరకు రూ.రూ.2.53 లక్షల జరిమానా విధించడం గమనార్హం. ఈ విషయమై విద్యుత్తు ఎస్ఈ వివరణ కోరేందుకు పలు దఫాలుగా ప్రయత్నించనప్పటికి ఆయన అందుబాటులోకి రాలేదు.

ఉద్యోగుల కనుసన్నల్లో...

క్షేత్ర స్థాయిలో కొనసాగుతున్న విద్యుత్తు చౌర్యం స్థానిక విద్యుత్తు ఉద్యోగుల కనుసన్నల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకుండా ఉచితంగా వ్యవసాయానికి విద్యుత్తు వినియోగించడంతో పాటు తమ పరిధిలోని ఫాంహౌజ్, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్తుకు స్థానిక లైన్‌మెన్, జేఎల్ఎంలు పరోక్షంగా సహకరిస్తూ సంస్థ ఆదాయానికి గండి కొడ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొనసాగుతున్న చౌర్యం విషయం తెలిసి కూడా కొందరు నెలనెలా ముడుపులు తీసుకుంటూ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని స్థాయిల్లో పకడ్బందీగా లైన్‌లాస్, ఎనర్జీ ఆడిట్ ప్రక్రియలను సంస్థ ఉన్నతాధికారులు చేపట్టని కారణంగా స్థానిక ఉద్యోగులకు ఈ అంశం కల్పతరువుగా మారింది.

## పదవి సరే.. పైసలేవీ..?

నల్గొండ : పదవీకాలం ఈ నెలాఖరుకు ముగుస్తుండటంతో పెండింగ్ బిల్లులపై గ్రామ సర్పంచుల్లో ఆందోళన నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కాలపరిమితిలోనే గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సర్పంచులు చేపట్టారు. హరితహారం, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణం, పల్లె ప్రకృతివనాలు, డ్రైనేజీలు, సీసీ రహదారుల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు తదితర పనులకు రూ.లక్షలు వెచ్చించారు. పెట్టుబడి పెట్టి పనులు చేసినా బిల్లులు మంజూరులో గత ప్రభుత్వంతో పాటూ ఉపాధి హామీలో చేసిన వాటికీ నిధులు మంజూరు కాకపోవడంతో అప్పులపాలయ్యారు. పలుమార్లు అప్పటి ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఉమ్మడి జిల్లాలో పలువురు సర్పంచులు భిక్షాటన చేసిన ఘటనలున్నాయి. తమ పదవీకాలం ముగుస్తున్నా పెండింగ్‌లో ఉన్న రూ.లక్షల బిల్లులు రాకపోవడంతో అప్పులిచ్చిన వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారని త్రిపురారం మండలానికి చెందిన ఓ సర్పంచి 'ఈనాడు'తో వాపోయారు. సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించడం పట్ల ఇప్పటికీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, ఎన్నికల నిర్వహణ పట్ల సైతం సర్కారు మొగ్గు చూపకపోవడంతో వచ్చే నెల నుంచి ప్రత్యేకాధికారుల పాలన ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. తాము పదవిలో ఉన్నప్పుడే బిల్లులను క్లియర్ చేసుకోవాలనే తలంపుతో సర్పంచులు ప్రభుత్వ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

గుదిబండగా మారిన ట్రాక్టర్ల నిర్వహణ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను కొనుగోలు చేయాలని గత ప్రభుత్వం ఆదేశించడంతో.. సర్పంచులు అప్పులు చేసి మరీ ట్రాక్టర్లను కొన్నారు. నెలనెలా పంచాయతీ నుంచి వసూలు చేసిన సొమ్ము గ్రామంలో నియమించిన మల్టీపర్పస్ వర్కర్లు, సిబ్బంది జీతాలకే సరిపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ పంచాయతీ సర్పంచులకు గుదిబండగా మారింది. చాలా చోట్ల నిర్వహణ లేకపోవడంతో అవి మూలకు చేరాయి. డీజిల్ బిల్లులతో పాటూ హరితహారంలో చెట్లకు నీరుపెట్టడం వల్ల వచ్చే డబ్బులు సకాలంలో రాకపోవడంతో ట్రాక్టర్ల డ్రైవర్లకూ నెలానెలా జీతాలిచ్చే పరిస్థితి లేకపోయింది. వేయి జనాభా ఉన్న గ్రామాల్లో పరిస్థితి కొంత మేలుగా ఉన్నా.. చిన్న పంచాయతీలు, కొత్తగా ఏర్పడిన వాటిల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. వాటికి నెలా నెలా రూ.లక్షలోపే ఆదాయం ఉండటం, ఖర్చు మాత్రం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉండటంతో సర్పంచులకు ఏం చేయాలో తోచక అప్పులు చేసి మరీ నిర్వహణ చేపట్టారు. ఇప్పుడు ఆ బిల్లులు రాకపోవడం, త్వరలోనే పదవీకాలం ముగియనుండటంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1740 పంచాయతీలుండగా.. దాదాపు 600 పంచాయతీలకు సగటున ఇప్పటి వరకు రూ.4 లక్షలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు అధికారుల స్పందన భిన్నంగా ఉంది. ఎక్కువగా ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఉపాధి హామీ కింద గ్రామాల్లో వైకుంఠధామాలు, రైతువేదికలతో పాటూ అనేక పనులు చేశారు.

## మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్న అధికారులు



హుజూరాబాద్ : గత నెల 20న పౌర సరఫరాలశాఖ అధికారులు జగిత్యాల జిల్లాలో 30 మిల్లులను తనిఖీలు చేశారు. సుమారు లక్ష క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టించినట్లు గుర్తించి 26 మంది మిల్లర్లకు షోకాజ్ నోటీసులు జారీ చ్టేశారు. మరో ఆరు మిల్లులను నిషేధిత జాబితాలో పెట్టారు. 38 మంది మిల్లర్లను డిఫాల్టర్లుగా గుర్తించి వారికి రూ.2.12 కోట్ల జరిమానా విధించారు.

గత నెల 28న ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంటలోని ఆరు మిల్లులను తనిఖీ చేసి సుమారు రూ.52 కోట్ల విలువైన 2.66 లక్షల క్వింటాళ్ల ధాన్యం మాయం చేసినట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

శంకరపట్నం మండలంలోని మొలంగూరులోని ఓ రైస్‌మిల్లుకు 38,893 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 23,504 క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించి రూ.7,18,26,515 జరిమానా చెల్లించాలని నోటీసులిచ్చారు. అయినా స్పందించక పోవడంతో మిల్లు నిర్వాహకుడిపై పలు సెక్షన్ల కింద కేసులు పెట్టి ఈ నెల 6న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఉమ్మడి జిల్లాలో ఇదే తొలి అరెస్ట్ కావడం గమనార్హం. ఈ నెల 6న జగిత్యాలలో పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లు యజమానులతో సమావేశం నిర్వహించి ధాన్యం మాయం చేసిన మిల్లర్లను నిషేధిత జాబితాలో పెట్టి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ఎం.ప్రభాకర్ హెచ్చరించారు. ధాన్యం లేకుండా బియ్యం ఇవ్వకుండా జాప్యం చేసే వారి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. ఈ నెల 31లోగా కచ్చితంగా నూరు శాతం సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ చర్యలకు సిద్ధమవుతోంది. 2022-23 యాసంగి, వానాకాలం సీజన్లలో అప్పగించిన ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని అప్పగించడానికి గత నెలలోనే గడువు ముగిసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు చివరి అవకాశంగా మరోసారి ఈ నెల 31 వరకు గడువు పొడిగించింది. ఈలోగా ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలకు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైతే జరిమానా విధించడంతోపాటు ఆర్.ఆర్. చట్టం ప్రకారం మిల్లర్ల ఆస్తులు జప్తు చేసేలా రంగం సిద్ధం చేస్తున్నారు. ధాన్యం ఉన్నా బియ్యం ఇవ్వని మిల్లర్లను డిఫాల్టర్లుగా గుర్తించి జరిమానా విధించాలని, ఒకవేళ ధాన్యం పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వని మిలర్లను నిషేధిత జాబితాలో పెట్టి మరోసారి వారికి సీఎంఆర్ కేటాయించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో లక్షల క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం అన్ని మిల్లులపై గట్టి నిఘా పెట్టాలని, సీఎంఆర్‌పై ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలని ఆదేశించినట్లు సమాచారం. దాంతో ఎలాగైనా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. అవసరమైతే ధాన్యం మిల్లింగ్ చేయని మిల్లుల నుంచి సీఎంఆర్ పూర్తయిన మిల్లులకు పంపించి మిల్లింగ్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంఆర్ లక్ష్యం పూర్తయ్యేలా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ మిల్లుల్లో ధాన్యం లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడి మిల్లర్లలో అలజడి ప్రారంభమైంది. అధికారుల ఒత్తిడితో ఇప్పటికే కొందరు మిల్లర్లు ప్రైవేటుగా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మరాడిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం చివరిగా విధించిన గడువు 14 రోజులే ఉండటంతో మిల్లర్ల నుంచి ఎలాగైనా బియ్యం సేకరించేలా అధికారులు అవసరమైన కసరత్తు చేస్తున్నారు. గడువులోగా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ స్పష్టం చేశారు.

## వేలల్లో బిల్లులు.. కళ్లలో నీళ్లు

సిరిసిల్ల : అక్షరాల 79 వేలు....: గర్జనపల్లికి చెందిన రాజయ్యకు ప్రతి నెలా రూ. 200 లోపు కరెంటు బిల్లు వచ్చేది. మీటర్ ఏర్పాటు నుంచి డిసెంబర్ నాటికి మొత్తం మీటర్ రీడింగ్ 3,100 యూనిట్లు వినియోగించినట్లు బిల్ రీడర్ బిల్లు ఇచ్చాడు. ఈ నెల 1న మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీస్తే ఇప్పటి వరకు 11,108 యూనిట్లు ఖర్చు చేసినట్లు వచ్చింది. 8,008 యూనిట్లకు అన్ని పన్నులతో కలిపి రూ.79,575 చెల్లించాలని బిల్లు ఇచ్చాడు. దీంతో అతను కంగుతిన్నాడు. తన పొరపాటు లేకుండా శిక్ష తనకెలా వేస్తారంటూ వాపోయాడు.

రెండు బిల్లులకు వ్యత్యాసం: వన్‌పల్లికి చెందిన చిన్న బాలయ్య మీటర్ ఏర్పాటు చేసిన నుంచి డిసెంబర్ వరకు మీటర్ రీడింగ్ 3,670 యూనిట్లు నమోదు చేశారు. ఒక్క డిసెంబర్‌లోనే 90 యూనిట్లు వాడినట్లు అన్ని ఛార్జీలతో కలిపి రూ. 303 బిల్లు వచ్చింది. అయితే జనవరిలో స్కాన్ చేసి రీడింగ్ తీస్తే ఇప్పటి వరకు మీటర్ రీడింగ్ 6,523 వచ్చింది. నెల రోజుల్లో 2,853 యూనిట్లు వినియోగించినట్లు రూ. 27,361 బిల్లు ఇచ్చారు. తాను ఎప్పుడూ తక్కువ రీడింగ్ నమోదు చేయాలని చెప్పలేదని వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ విద్యుత్తు యూనిట్లు పట్టణాలతో పోలిస్తే తక్కువగానే ఉంటాయి. సాధారణంగా నెల నెలా కరెంటు బిల్లులు వెయ్యి లోపే ఉంటాయి. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని కొన్ని గ్రామాల్లో వేలల్లో రావడంతో వినియోగదారులు కంగుతింటున్నారు. బకాయిల వసూలుకు వచ్చే సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. సెస్ సిబ్బంది చేసిన తప్పునకు తామెందుకు బాధ్యత వహించాలని ప్రశ్నిస్తున్నారు.

పొరపాటు ఎవరిది?

వినియోగ యూనిట్ల ఆధారంగా సంబంధిత కనెక్షన్‌లకు విద్యుత్తు ధర నిర్ణయిస్తారు. యూనిట్లు పెరిగిన కొద్దీ శ్లాబు ప్రకారం ఆ ధరలో పెరుగుదల ఉంటుంది. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో వినియోగదారులు ఎక్కువ విద్యుత్తు వాడినప్పటికీ రీడింగ్ నమోదులో పొరపాటు జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. బిల్ రీడర్‌లు వినియోగదారులు వాడిన రీడింగ్ ప్రకారం కాకుండా వందలోపు రీడింగ్‌ను మాన్యువల్‌గా నమోదు చేశారని అభిప్రాయపడుతున్నారు. ప్రతి నెలా ఇలాగే పునరావృతం అయింది. కొంత కాలంగా ఇది జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. అయితే సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగ విద్యుత్తుకు, ప్రతి నెలా వినియోగదారులు వాడిన రీడింగ్‌లో తీవ్ర వ్యత్యాసం గమనించారు. కొత్తగా వచ్చిన మీటర్ రీడర్‌లు మీటర్‌లను స్కాన్ చేసి కచ్చితమైన రీడింగ్ ప్రకారం బిల్లులు వేశారు. ఫలితంగా ఒక్కో వినియోగదారుడికి రూ.10 వేలకు పైగా కరెంటు బిల్లులు వచ్చాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. సెస్ సిబ్బంది చేసిన పొరపాటుకు తాము బాధ్యత వహించేది లేదని వినియోగదారులు ఆందోళనలు చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు- మహేందర్, ఏడీ, సెస్

వినియోగదారులు ఆందోళనలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. జిల్లాలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితి ఉంది. ఇంతకు ముందు మీటర్ రీడర్‌లు కొంత పొరపాటు చేసినట్లు భావిస్తున్నాం. సబ్‌స్టేషన్‌లో వినియోగ కరెంటు, బిల్లింగ్ యూనిట్లకు మధ్య వ్యత్యాసం వచ్చింది. అసలు రీడింగ్‌ని ఈ నెలలో తీయడంతో బిల్లు అధికంగా వచ్చింది. బిల్లుల విషయంలో అనుమానాలు ఉంటే సెస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పాం. సిబ్బందితో క్షేత్రపరిశీలన చేసి గృహోపకరణలు, మీటర్‌లను పరిశీలిస్తాం. సిబ్బంది పొరపాటు ఉంటే తగిన చర్యలు తీసుకుంటాం. రూ.30 వేలు వచ్చింది- మెరుగు శ్రీనివాస్, గంభీరావుపేటనాలుగు సంవత్సరాలుగా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నాను. చిన్న ఇల్లు కావడంతో ప్రతి నెలా రూ. 300 బిల్లు వస్తుంది. ఈ నెల రూ. 33 వేలు వచ్చింది. దీనిపై సెస్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. సిబ్బంది వచ్చి ఇంట్లో గృహోపకరణలు, మీటర్‌ను పరిశీలించారు. ఎప్పుడూ తక్కువ రీడింగ్ వేయాలని చెప్పలేదు. అయినప్పటికీ ఇలా బిల్లు వచ్చింది. దీనికి పూర్తి బాధ్యత సెస్ వహించాలి.

## రెండో వంతెన నిర్మాణంపై నీలినీడలు

వేములవాడ : ఏటా భారీ వర్షాలకు మూలవాగు ఉద్ధృతంగా పారడంతో వంతెన నిర్మాణ పనులకు అడ్డంకిగా మారుతోంది. దీంతో పాటు వంతెనకు ఇరువైపులా భూసేకరణ కాకపోవడంతో వంతెన నిర్మాణంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా వంతెన పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని దుస్థితి నెలకొంది. వేములవాడ మూలవాగులో రెండో వంతెన నిర్మాణ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి మూడు సార్లు పిల్లర్ల దశలోనే వంతెన బీమ్‌లు కుంగిపోవడం, మరో రెండు సార్లు భారీ వర్షాలకు అల్లిన సలాక సపోర్టు పైపులు కొట్టుకుపోవడం వంటి సమస్యలతో పనులు ముందుకు సాగడం లేదు. అయిదు పిల్లర్ల స్టాండ్లలో కేవలం మధ్యలో రెండు మాత్రమే పూర్తి చేశారు. గత ఏడాది నుంచి పనులు ముందుకు సాగిన దాఖలాలు లేవు. దీంతో వంతెన ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారికి రవాణా పరంగా అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వేములవాడ మూలవాగు పాత వంతెనకు ఇరువైపులా రెండు వంతెనల నిర్మాణంతో పాటు వంతెనల వద్ద కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు 2015 సంవత్సరంలో కోర్‌నెట్ నిధులు రూ.28 కోట్లు మంజూరు చేయగా, వాటిలో రెండు వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించారు. నిధులు విడుదల కావడంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మికత ఉట్టి పడేలా వంతెనలు డిజైన్ చేయడంతో పాటు పాత వంతెనకు ఇరువైపులా 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో వాటి నిర్మాణానికి రూపకల్పన చేశారు. రెండు వంతెనల చివర కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. పడమటి వైపు వంతెన నిర్మాణం పూర్తి చేసి నాలుగేళ్ల క్రితం మహాశివరాత్రి సందర్భంగా ప్రారంభించారు. దీంతో అది ఉపయోగంలోకి వచ్చింది. భక్తులు, ప్రయాణికుల ఇబ్బందులు కొంత మేరకు తగ్గాయి. రెండోది పూర్తి చేయాల్సి ఉంది.

ఏటా వర్షాకాలంలో అడ్డంకి...

మూలవాగులో రెండో వంతెన నిర్మాణ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి ఏటా అంతరాయం ఏర్పడుతూనే ఉంది. సెంట్రింగ్ దశలోనే భారీ వర్షాలకు సపోర్టు పైపులు కొట్టుకుపోయి మూడు సార్లు కూలి పోయి పనులకు



అంతరాయం ఏర్పడింది. మొదట బీములపై స్లాబ్ వేసే దశలో 2019 సెప్టెంబరులో భారీ వర్షాలకు సెంట్రింగ్ సపోర్టు కర్రలు కొట్టుకుపోయి బీమ్ వంగిపోయి కూలి పోయింది. అప్పటి నుంచి భారీ వర్షాలకు బీమ్‌ల నిర్మాణాకి స్టీల్ అల్లుతున్న క్రమంలో సపోర్టు కర్రల అడుగు భాగంలో ఇసుక కొట్టుకుపోయి కుంగిపోవడం, కొట్టుకుపోవడం వంటి కారణాల ఆగిపోయాయి. వంతెనకు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. కానీ రెండే పూర్తి చేశారు. వాస్తవానికి ఈ వంతెన 2018లోనే పూర్తి కావాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల్లో ముందు చూపు లేక ఇతర కాలాల్లో పనులు చేయించలేక భారీ వర్షాల సమయంలోనే పనులు చేస్తున్నారనే విమర్శలున్నాయి. నేటికీ వంతెనకు ఇరువైపులా భూసేకరణ పూర్తి కాకపోవడం కూడా నిర్మాణంలో తీవ్ర జాప్యానికి కారణమవుతోంది. భూసేకరణ కాకపోవడంతో వంతెన పిల్లర్ల నిర్మాణం వాగు మధ్యలో మొదలు పెట్టారు. ఇప్పటికైనా దీనిని పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

పూర్తి చేసేందుకు చర్యలు- సతీశ్, ఆర్అండ్‌బీ ఏఈ, వేములవాడ

రెండో వంతెన నిర్మాణ పనులు తిరిగి మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. వంతెనకు ఇరువైపులా భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గుత్తేదారుతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

## పాలేరు ఖాళీ..!

మోతె : జిల్లాలో ప్రధానంగా తాగునీరు, పరోక్షంగా కొంతమేర సాగునీటి అవసరాలు తీరుస్తున్న సరిహద్దులోని పాలేరు జలాశయం రోజురోజుకు ఖాళీ కుండలా మారుతోంది. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఖమ్మం-సూర్యాపేట సరిహద్దు ప్రాంతంలో 2.558 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పాలేరు జలాశయం నిర్మించారు. దీని ద్వారా ఖమ్మం జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అంతకుమించి ఖమ్మం, సూర్యాపేట జిల్లాలతో పాటు పక్కనున్న మరికొన్ని జిల్లాలకు చెందిన సుమారు రెండు వేల గ్రామాలకు ఈ జలాశయం నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా నిత్యం లక్షల క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు వాడుతున్నారు. సాగర్‌లో నీటి లభ్యత లేక ఎడమకాల్వకు నీటి విడుదలలో నెలకొన్న జాప్యం.. గడిచిన నెల రోజులుగా పాలేరు పరివాహక ప్రాంతాల నుంచి చుక్కనీరు ఇన్‌ఫ్లో రాకపోవడంతో జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది.

జిల్లాలో ఈ జలాశయంపై ఆధారపడి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలంతో కలిపి వందలకొద్దీ గ్రామాలకు తాగునీటి సరఫరా ఇక్కడి నుంచే జరుగుతుంది. రిజర్వాయర్ పూర్తి నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులు కాగా ప్రస్తుతం 14 అడుగులే ఉంది. ఇన్‌ఫ్లో లేకపోవడం, నిత్యం పలు జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు కలిపి కేవలం తాగునీటికే 125 క్యూసెక్కులకు పైగా వాడుతుండటం.. దీనికి తోడు ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలకు నీటివిడుదల చేపట్టడంతో రిజర్వాయర్‌లోని నీరు మరో రెండు వారాలైనా వచ్చేలా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే వేసవికాలం గడిచేదెలా అనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

394 గ్రామాలకు పొంచి ఉన్న తాగునీటి గండం

పాలేరు రిజర్వాయర్ ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి మిషన్ భగీరథ పథకం కింద మంచినీటి సరఫరా అవుతున్న జిల్లాలోని 394 గ్రామాలకు కొద్ది రోజుల్లోనే తాగునీటి గండం పొంచి ఉంది. ఖమ్మం



జిల్లా నాయకన్‌గూడెం గ్రామం సమీపంలో రిజర్వాయర్‌లోని ఇన్‌టేక్‌వెల్ నుంచి సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలకు చెందిన 353 గ్రామాలకు నిత్యం నీటి సరఫరా జరుగుతోంది. వీటితో పాటు జలాశయాన్ని ఆనుకొని ఉన్న మోతె మండలంలోని 41 గ్రామాలకు అన్నారిగూడెం నీటి శుద్ధి ప్లాంటు నుంచి మంచినీటి సరఫరా అవుతుంది. జిల్లాలో తాగునీటి అవసరాలకు ఇక్కడి నుంచి రోజుకు 43 మిలియన్ లీటర్ల నీటిని తీసుకుంటున్నారు. ఈ జలాలను చివ్వెంల మండలం చందుపట్ల 18 ఎంఎల్‌డీ నీటిశుద్ధి ప్లాంటు, తుంగతుర్తి నియోజకవర్గంలోని చిల్పకుంట్ల వద్ద 20 ఎంఎల్‌డీ ప్లాంటు, మోతె మండలం అన్నారిగూడెం వద్ద 5 ఎంఎల్‌డీ ప్లాంటును ఏర్పాటు చేసి శుద్ధజలాలను అందిస్తున్నారు.

ప్రస్తుతం రిజర్వాయర్‌లో పడిపోతున్న నీటిమట్టంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా ఈ జలాశయంలో నీటినిల్వల తగ్గుదలపై ప్రజల్లోనూ ఆందోళన పెరుగుతోంది. ప్రధానంగా రిజర్వాయర్ చుట్టూ ఉన్న గ్రామాల రైతులు సుమారు మూడున్నర వేల విద్యుత్తు మోటార్లతో సాగునీటిని తరలించుకుం టున్నారు. ఇలా సాగులో ఉన్న పంటల పరిస్థితి డోలాయమానంలో పడింది. నీటినిల్వలు పడిపోతూ తాగు, సాగు నీటి అవసరాలకు నీటి లభ్యత దిన దిన గండంగా మారడంతో దీని పరిధిలోని పల్లెలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇటు నాగార్జునసాగర్, అటు శ్రీరాంసాగర్ నుంచి పాలేరు జలాశయా నికి నీటిని చేరవేసేందుకు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ద్వారా మంత్రి దృష్టికి

అరుణా సాగర్, మిషన్ భగీరథ ఈఈ, సూర్యాపేట

ఈ సమస్యపై ఇటీవల జరిగిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించారు. జలాశయంలో నీటిమట్టం తగ్గడంపై ఉన్నతాధికారులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌కు నివేదించడం జరిగింది.

## కారుణ్యం చూపారు..!

సూర్యాపేట : ఎట్టకేలకు కారుణ్య నియామకాల ప్రక్రియకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. దీంతో గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బ్రెడ్ విన్నర్ స్కీంలో భాగంగా ఈ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులతో కారుణ్య నియామకాల కింద కండక్టర్ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆ సంస్థకు ప్రభుత్వం సూచించింది. గతంలోనే వీటిని భర్తీ చేయాల్సి ఉండగా.. ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో నిలిచాయి. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు నియామకాల ప్రక్రియను వేగవంతం చేశారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, నల్గొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోలలో పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం 70 మంది బాధిత కుటుంబాలున్నాయి. ఆర్టీసీ నిర్ణయంతో వారికి భరోసా కలుగనుంది.

పదేళ్లుగా నిరీక్షణ ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాల్సి ఉంది. కానీ, పదేళ్లుగా వీటికి సంబంధించి ఎటువంటి నియామకాలు చేపట్టలేదు. దీంతో ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయాయి. జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నిబంధనల ప్రకారం ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు భర్తీ చేసి ఉంటే మృతుల కుటుంబాలకు భరోసా కలిగేది. కారుణ్య నియామకాల్లో కండక్టర్ ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా గతంలో కొంత మందికి సెక్యూరిటీ ఉద్యోగాలు ఇచ్చారు. దీనిపై వారంతా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తాజాగా కారుణ్య నియామకాలు చేపట్టనుండటంతో బాధిత కుటుంబాలకు న్యాయం జరగనుంది. ప్రభుత్వ నిర్ణయంతో బాధితుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నియామకాలను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని ఆర్టీసీ సంఘాల నాయకులు, కార్మికుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం నియామకాలు...

-శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ

కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేశాం. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో అధికారులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. డిపోల వారీగా బాధితుల వివరాలను బస్ భవన్‌కు పంపించాం. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పోస్టులు భర్తీ చేస్తాం.

## అతి తక్కువకే రోబో వైద్యం

హైదరాబాద్: రోబో చికిత్సలు నిమ్స్‌లో కూడా అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తున్నారు. ఈ పథకం వర్తించని రోగులకు సైతం బయట ఆసుపత్రులతో పోల్చితే అతి చౌకగా సేవలు పొందుతున్నారు. గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 115 రోబో చికిత్సలు విజయవంతంగా చేశారు. తాజాగా 6, 13 ఏళ్ల బాలులకు చేశారు. కిడ్నీ నుంచి వెళ్లే రక్తనాళంలో బ్లాక్ కావడంతో రోబో సాయంతో ఈ చికిత్సలు చేశారు. నిమ్స్‌లో 10 మంది వరకు వైద్యులు రోబో చికిత్సలకు శిక్షణ తీసుకున్నారు. నెలకు ఇద్దరు చొప్పున మరో 10 మంది వరకు శిక్షణ పొందనున్నారు. దీంతో త్వరలో ప్రభుత్వ వైద్యశాలలో పెద్ద సంఖ్యలో రోబో శస్త్రచికిత్స నిపుణులు అందుబాటులోకి రానున్నారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ అంకాలజీ వైద్యులు డాక్టర్



రాహుల్‌దేవ్ రాజ్, డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ వర్మ, డాక్టర్ నిర్మల ఇతర సిబ్బంది ఈ సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రొస్టేట్, యూరినరీ బ్లాడర్, కిడ్నీ క్యాన్సర్ ఇతర చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోబో చికిత్సల కోసం రూ.2-6 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. నిమ్స్‌లో అంతకంటే 40 శాతం తక్కువకే ఈ సేవలు అందిస్తున్నారు. ఇక ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు పూర్తిగా ఉచితంగా చేయనున్నారు.

అందే సేవలు ఇలా..

సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ: గాల్‌బ్లాడర్, క్లోమగ్రంథి, కాలేయం, పేగులు, అన్నవాహిక తదితర అవయవాల్లో క్యాన్సర్ ఇతర కణుతులు

యురాలజీ: మూత్రకోశం, ప్రొస్టేట్, కిడ్నీ, కిడ్నీ నుంచి వెళ్లే ట్యూబ్ బ్లాకేజీలు, పెల్విస్, అడ్రినల్ గ్రంథిల్లో క్యాన్సర్ కణుతులు

సర్జికల్ అంకాలజీ: గర్భసంచి, అండాశయం, పేగులు ఇతర క్యాన్సర్లు.

## విశ్రాంత అధికారులు ఇంటికే!

హైదరాబాద్ : హెచ్ఎండీఏ, బల్దియా, జలమండలితోపాటు ఇతర విభాగాల్లో విశ్రాంత అధికారులను ఇంటికి పంపించే ఘట్టం తుది అంకానికి చేరుకుంది. నేడో, రేపో దీనిపై ప్రభుత్వ స్థాయిలో తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఇప్పటికే రిటైర్ అయి ఇంకా విధుల్లో కొనసాగుతున్న విశ్రాంత అధికారుల సమాచారాన్ని అధికారులు ప్రభుత్వానికి అందించారు. వీరిపై తమకు నచ్చిన వారికి కాంట్రాక్టులు వచ్చేలా చేయడం.. కమీషన్లు గుంజడం.. తదితర ఆరోపణలున్నాయి. ఆరేడేళ్ల క్రితమే రిటైర్ అయినప్పటికీ పైస్థాయిలో పరిచయాలతో ఏటా సర్వీసును పొడిగించుకుంటూ చాలామంది అధికారులు ఆయా విభాగాల్లో కొనసాగుతున్నారు. దీంతో వేరే అధికారులు వారి స్థానంలో పదోన్నతిపై వెళ్లడానికి వీలు కావడం లేదు.

జలమండలిలో.. ఈఎన్‌సీ స్థాయిలో ఒక ఉన్నతాధికారితోపాటు జీఎం కేడర్‌లో మరో ఏడుగురు విశ్రాంత అధికారులు పదవీ విరమణ పొందినా ఇంకా విధులు నిర్వహిస్తున్నారు.

బల్దియాలో.. ఇక్కడా కూడా అదే పరిస్థితి. రిటైర్ అయి నాలుగైదేళ్లవుతున్నా కుర్చీలు వదలడం లేదు. అదనపు కమిషనర్ స్థాయిలో ఒక అధికారి, సీఈ స్థాయిలో మరో అధికారి వారి స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ఓఎస్డీ పేరుతో ఓ అధికారి, మరో అయిదుగురు విధులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎండీఏలో.. దాదాపు పదిమంది వరకు అధికార దర్పం వెలగబెడుతున్నారు. ఇందులో చాలామందికి అసలు పనే ఉండటం లేదని విమర్శలున్నాయి. రావడం, కాసేపు కార్యాలయంలో గడపడం, తిరిగి ఇంటికెళ్లిపోవడం తప్ప వీరి సేవలతో హెచ్ఎండీఏకు ఒరిగిందేమీ లేదు. నెలానెలా భారీగా జీతభత్యాలు తప్ప కొందరికైతే అసలు ఏ బాధ్యతలు ఉండటం లేదు. ఇప్పటికే డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు అధికారులను కొత్త ప్రభుత్వం రద్దు చేసి వాళ్ల మాతృ విభాగాలకు పంపింది. మరోవైపు కీలక స్థానంలో ఉన్న అధికారికి మరో 3 నెలలు గడువు ఉండటంతో ప్రస్తుతం ఆయన్ని కొనసాగిస్తారా.. ఇంటికి పంపిస్తారా అనేది చర్చనీయాంశమైంది.

హెచ్ఎండీఏ సీఈ రాజీనామాహెచ్ఎండీఏలో కీలక వికెట్ పడింది. 2018లో రిటైర్ అయినా అదే పోస్టులో కొనసాగుతున్న సీఈ బీఎల్ఎన్ రెడ్డి అనారోగ్య కారణాలతో ఆ పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల క్రితమే రాజీనామా సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పోస్టులో ఇన్‌ఛార్జి సీఈగా ప్రస్తుత ఎస్ఈ సీహెచ్ పరంజ్యోతికి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సీనియర్లు ఉండగా ఆమెకు బాధ్యతలు అప్పగించడంపై చర్చ నడుస్తోంది.

# అయోధ్యకు ఎలా వెళ్లాలి!



పెద్దపల్లి : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 22న నిర్వహించే రామమందిర ప్రాణప్రతిష్ఠ వేడుక కోసం దేశం యావత్తు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఆహ్వానం అందిన వాళ్లు ఉత్సవాన్ని కళ్లారా చూసి తరించేందుకు సమాయత్తమవుతున్నారు. మిగతా వాళు తర్వాతనైనా చూసి రావాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి ఎలా వెళ్లాలన్న విషయమై ఉమ్మడి జిల్లా ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లా వాసులు నేరుగా అయోధ్య వెళ్లేందుకు రైళ్లు అందుబాటులో లేవు. కానీ వారణాసి, లఖ్‌నవూ పట్టణాల మీదుగా చేరుకునేందుకు అవకాశముంది. కరీంనగర్ నుంచి తిరుపతి మాదిరిగానే కాశీ మీదుగా అయోధ్య వరకు రైలు నడిపిస్తే జిల్లా వాసులు శివ, కేశవులను దర్శించుకునే అవకాశం దక్కుతుంది.

రాష్ట్రం నుంచి రెండే ఎక్స్‌ప్రెస్‌లు: యశ్వంత్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్ వెళ్లే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం నుంచి అయోధ్య వెళ్లే శ్రద్ధాసేతు ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే మన రాష్ట్రం నుంచి అయోధ్యకు నేరుగా వెళున్నాయి. వీటిలో ప్రతి సోమవారం నడిచే శ్రద్ధాసేతు ఎక్స్‌ప్రెస్‌కు వరంగల్‌లో మాత్రమే హాల్టింగ్ ఉంది. ప్రతి నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్, కాచిగూడ, కాజీపేట, సిర్పూర్ కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది. ఉమ్మడి జిల్లా వాసులు కాజీపేట, వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్‌ల నుంచి పై రెండు రైళ్లలో అయోధ్యకు వెళ్లేందుకు అవకాశముంది.

వయా వారణాసి

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్‌ల నుంచి లఖ్‌నవూ, వారణాసి, కాన్పూర్, గోరఖ్‌పూర్‌ల మీదుగా అయోధ్య వెళ్లేందుకు పలు రైళ్లు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై నుంచి లఖ్‌నవూ వెళ్లే లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళ, శనివారాల్లో నడుస్తుంది. జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండంల నుంచి లఖ్‌నవూ వెళ్లి అక్కడి నుంచి అయోధ్యకు చేరుకోవాలి.

సికింద్రాబాద్-దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడుస్తుంది. ఈ రైలులో వారణాసి చేరుకొని కాశీ విశ్వేశ్వరుడి దర్శనం అనంతరం అయోధ్యకు వెళ్లవచ్చు. ఈ రైలుకు పెద్దపల్లి, రామగుండంలలో హాల్టింగ్ ఉంది.

సికింద్రాబాద్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లలో శుక్రవారం నడిచే రైలు పెద్దపల్లిలో, నడిచే రైలు రామగుండంలో ఆగుతుంది. ఈ రైలులో కాన్పూర్ వెళ్లి అక్కడి నుంచి అయోధ్యకు చేరుకోవచ్చు.

ఇవే కాకుండా దానాపూర్ స్పెషల్ ప్రతి ఆదివారం పెద్దపల్లిలో, ప్రతి శనివారం రామగుండంలో ఆగుతుంది. వీటితో పాటు కేవలం రామగుండంలో హాల్టింగ్ కలిగిన రక్స్‌వల్ ఎక్స్‌ప్రెస్, సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, పట్నా ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో కాన్పూర్, ఉన్నావ్ జంక్షన్, లఖ్‌నవూ, వారణాసి మీదుగా అయోధ్యకు చేరుకోవాలి.

అయోధ్య నుంచి వారణాసికి 219 కి.మీ., లఖ్‌నవూ 135 కి.మీ, ఉన్నావ్ జంక్షన్ 201 కి.మీ, కాన్పూర్ 236 కి.మీ.ల దూరంలో ఉంటాయి. ఆయా స్టేషన్ల నుంచి రోడ్డు మార్గంలో అయోధ్యకు వెళ్లవచ్చు.

నేరుగా నడిపేందుకు ప్రయత్నిస్తాం-శ్రావణ్, డివిజన్ రైల్వే వినియోగదారుల సలహా సంఘం సభ్యుడు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో మన రాష్ట్రం నుంచి నేరుగా అయోధ్యకు రైలు నడపడం లేదు. త్వరలోనే కొత్త రైలు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగే డీఆర్‌యూసీసీ సమావేశంలో కొత్త రైలు వేయడంతో పాటు ఉమ్మడి జిల్లాలోని మూడు ప్రధాన స్టేషన్‌లలో హాల్టింగ్ కల్పించేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల ఉమ్మడి జిల్లావాసులు నేరుగా అయోధ్య చేరుకునేందుకు అనుకూలంగా ఉంటుంది.

## వ్యర్థం వద్దు.. పొదుపు ముద్దు



కరీంనగర్ : ప్రతి ఇంట్లో నిత్యం ప్లాస్టిక్ వాడకం, ఇంట్లో విద్యుత్తు వినియోగం, ఆహార వృథా అనేది కనిపిస్తోంది.. పొదుపు చేయడంతోపాటు, వృథాను అరికట్టడం అనేదీ మన చేతిలో ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. నూతన సంవత్సరంలో ప్రజల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆ మూడింటిపై దృష్టి సారించారు. మొదట అధికారులు పాటించి.. ప్రజలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఎవరికి వారు బాధ్యతగా ప్రయత్నిస్తే కలెక్టర్ చెప్పిన అంశాలు ఆచరించడం కష్టమేమి కాదు. ఇలా చేయడంతో వ్యక్తిగతంగా కాకుండా సమాజానికి మేలు చేసిన వారిమి అవుతాం. కలెక్టర్ చెప్పిన మూడు అంశాలపై కథనం.

నెలకు ప్లాస్టిక్ వాడకం.. 190 టన్నులు పాలిథిన్ వాడకం హానికరమని తెలిసినా విచ్చలవిడిగా వాడుతున్నాం. క్యాన్సర్ వస్తుందనే ఆందోళన ఉన్నా వినియోగం మాత్రం తగ్గడం లేదు. టిఫిన్లు, పండ్లు, కూరగాయలు, పాల పొట్లాలు, నిత్యావసర సరకులు, దుస్తులు ఏ వస్తువు ఇంటికి తీసుకొచ్చినా వీటి వెంట ప్లాస్టిక్ కవర్ తోడుగా ఉంటుంది. పర్యావరణానికి, ఆరోగ్యానికి సవాల్‌గా మారి ముప్పు తీసుకొచ్చినా గుట్టలుగా నిల్వలు పేరుకుపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని పురపాలికలు, నగరపాలిక కలిపితే నెలకు 190 టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారు. ఒక్క కరీంనగర్ నగర పాలక పరిధిలోనే రోజుకు అయిదారు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్‌యార్డుకు చేరుతున్నాయి. ప్రత్యామ్నాయంగా చేతి సంచి, కాగితాపు కవర్లు, టిఫిన్ డబ్బాలు, జ్యూట్ బ్యాగులు, లోహం, సీసం బాటిళ్లు వాడాలి.

రోజు ఆహారం వృథా : 4 టన్నులు

ఒకప్పుడు కంచంలో అన్నం మెతుకు మిగలకుండా ఆహారాన్ని తినేవారు. ప్రస్తుతం అదనంగా వేసుకొని సగం మేర పడేస్తున్నారు. ముఖ్యంగా వేడుక మందిరాల్లో జరిగే శుభ కార్యాల్లో ఈ వృథా ఎక్కువగా కనిపిస్తోంది. ఇళ్లలో జరిగే చిన్న వేడుకలు, పండుగల సమయంలోనూ ఆహారం మిగులుతోంది. జిల్లాలో రోజుకు నాలుగు టన్నుల ఆహారం వృథా అవుతుందని చెబుతుండగా, ఒక్క కరీంనగర్‌లోనే నెలకు 60 టన్నుల మేర వ్యర్థాల కిందికి వస్తుంది. అంచనాలు తప్పి ఒక వేళ మిగిలితే అనాథలకు దానం చేయొచ్చు. ఆశ్రమాలకు వెళ్లి ఆహార పదార్థాలను ఇస్తే పలువురి కడుపు నింపిన వారవుతారు. నగరంలో ఒకటెండ్రు ఆశ్రమ నిర్వాహకులు వారే స్వయంగా తీసుకెళ్తుంటారు.

విద్యుత్తు ఆదా : 70 శాతమే ఇళ్లలో, కార్యాలయాల్లో అవసరం లేకున్నా లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, టీవీల వాడకం ఎక్కువైంది. ప్రభుత్వ సంస్థల్లో అధికారులు, సిబ్బంది లేకున్నా ఫ్యాన్లు తిరుగుతుంటాయి. జిల్లాలో కొన్ని చోట్ల వీధిలైట్లు పొద్దంతా వెలుగుతుంటాయి. కొన్ని చోట్ల సమయానికి కంటే ముందే వెలుగుతూ.. ఆలస్యంగా ఆఫ్ చేస్తుంటారు. ఇళ్లలో ఇతర పనుల్లో ఉన్నా.. మరో వైపు టీవీ నడుస్తూనే ఉంటుంది. అవసరం లేకున్నా ఏసీలు వేస్తున్న వారూ ఉన్నారు. జిల్లాలో 70 శాతం మంది పొదుపు చేస్తుండగా.. మిగతా 30 శాతం వృథాతో కరెంటు బిల్లుల మోత మోస్తుంది. దీని ప్రభావం ఉత్పత్తి, నిర్వహణపై కూడా పడుతుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైనప్పుడే టీవీ, ఏసీ వేసుకొని తర్వాత బంద్ చేయాలి. నిరంతరం వెలిగే దీపాలకు చెక్ పెట్టాలి.

## అక్రమ వెంచర్లు.. సౌకర్యాలకు అగచాట్లు

పెద్దపల్లి : స్థిరాస్తి వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో ఇళ్ల స్థలాలు గుంటకు రూ.40 లక్షలకు పైగా పలకడంతో కొందరు పెగడపల్లి రహదారికి ఆనుకొని మరో వెంచర్ ఏర్పాటు చేశారు. స్థిరాస్తి వ్యాపారులు ప్రభుత్వ అనుమతి పొందకుండా అక్రమంగా ప్లాట్లు విక్రయిస్తున్నారు.

వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్..తాజాగా గోపాల్‌రావుపేట శివారులోని ఎస్సీ కాలనీకి ఆనుకుని అక్రమ వెంచర్ ఏర్పాటు చేయడంతో వర్షపునీరు ప్రవహించడానికి దారి మూసుకుపోయింది. సదరు స్థలంలో రూ.40 లక్షలకు ప్లాట్ చొప్పున సుమారు 30 ప్లాట్లను విక్రయించారు. గుంటన్నర విస్తీర్ణం ప్లాట్ స్థలాన్ని లక్షలాది రూపాయలకు ఒక్కొక్కరికి వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేశారు. కొన్న వారంతా తిరిగి వ్యవసాయేతర భూములుగా నాలా పన్ను చెల్లించి మార్పిడి చేసుకుని గ్రామ పంచాయతీలో ఇంటి నిర్మాణానికి రెండోసారి డబ్బులు చెల్లించి అనుమతి పొందాల్సి ఉంది. అక్రమ వెంచర్‌లోని ప్లాట్ల కొనుగోలుదారులు ఈ విధంగా నష్టపోతున్నారు. ఇటీవల గోపాల్‌రావుపేట గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్రమ వెంచర్ స్థలంలో కొత్త నిర్మాణాలు చేపట్టకుండా ఆదేశించారు.

నిబంధనలకు నీళ్లు..గోపాల్‌రావుపేటలో స్థిరాస్తి ధరలు కరీంనగర్ ధరలకు పోటీ పడుతుండటంతో లేఅవుట్ నిబంధనలు కాగితాలకు పరిమితమవుతున్నాయి. ఇదే గ్రామంలో ప్రభుత్వ అనుమతి పొందిన లేఅవుట్లు కూడా ఉన్నాయి. ప్రజోపయోగానికి 10 శాతం భూమిని గ్రామపంచాయతీకి, రహదారి, మురుగునీటి కాలువకు, విద్యుద్దీపాలు, ఇతర సౌకర్యాలకు స్థలం కేటాయించాల్సి ఉంటుంది. స్థిరాస్తి డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులు ఇళ్ల స్థలాలుగా కాకుండా వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేస్తూ నామమాత్రపు ఛార్జీలతో నెట్టుకొస్తున్నారు. గుంటన్నర విస్తీర్ణంతో వ్యవసాయ భూమికి పట్టాదారు పాసుపుస్తకం, రైతుబంధు కూడా మంజూరవుతున్నాయి. రామడుగు మండలంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వెలిచాల, దేశరాజ్‌పల్లి, గోపాల్‌రావుపేట గ్రామాల్లో నాలుగు అధికారిక వెంచర్లు మాత్రమే ఉన్నాయి. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి అనుమతి రాక కొనుగోలుదారులు అగచాట్లు పడుతున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడటమే కాకుండా ప్లాట్ల కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## కట్టలు తెంచుతున్న కష్టాలు

పెద్దపల్లి : యాసంగి సీజన్ ఆరంభంలోనే సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. దిగువ ప్రాంత రైతులు పంటలను ఒడ్డెక్కించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట శివారులో హుస్సేన్‌మియా వాగుపై రూ.4 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం పేల్చివేత యత్నం పరిస్థితులకు అద్దం పడుతోంది. మంథని, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, రామగుండం మండలాల్లోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు ఏటా సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. గడిచిన అయిదేళ్లలో నీటి లభ్యత అధికంగా ఉండటంతో పెద్దగా పోరాటాలు జరగలేదు. ఈసారి అనూహ్యంగా సీజన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం వివాదానికి దారి తీసింది.

ఎగువన అధిక వినియోగం అరికడితేనే..

జిల్లాలోని ఆయకట్టును విభజించడంలో నీటిపారుదల శాఖ అధికారులు ఏనాడూ దృష్టి సారించలేదు. పెద్దపల్లి నియోజకవర్గంలో పూర్తిగా డి-83, డి-86 కాలువల కిందే పంటలు సాగవుతున్నట్లు చెబుతున్నారు. వీటిలో చెరువుల కింద, బావుల కింద, వాగు కింద ఎంత మేరకు సాగవుతుందో కనీస గణాంకాలు అందుబాటులో లేవు. బావులు, చెరువుల కింద నీటి లభ్యత ఎంత? ఎంత మేర రైతులు సాగు చేస్తున్నారు? వీటికి అదనపు నీటికి ఎక్కడి నుండి తరలిస్తున్నారనే



విషయాన్ని పట్టించుకోవడం లేదు. నీటి తీరువాను కూడా గత ప్రభుత్వం ఎత్తేయడంతో ఎగువ ప్రాంతాల రైతులు మోటార్ల సాయంతో బావులు, చెరువుల కింది ఆయకట్టుకు నీటి మళ్లిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంత రైతులకు కష్టాలు తప్పడం లేదు. మరోవైపు హుస్సేన్మియా వాగుపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు వట్టిపోవడంతో పెద్దసంఖ్యలో రైతులు వాగులో మోటార్లు బిగించి నీటిని తరలిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వాగులోనే బావులు, బోర్ల తవ్వకం జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సారెస్పీ నీటిని వాగులోకి అదనంగా వదలడంతోపాటు ప్రాజెక్టు కాలువల ఎగువ ప్రాంతాల్లో అధిక వినియోగాన్ని అరికడితే సమస్యకు కొంతమేరకైనా పరిష్కారం దొరుకుతుంది.

పెద్దపల్లి నియోజవర్గాన్ని రెండుగా విభజిస్తున్న హుస్సేన్మియా వాగు నియోజకవర్గ రైతులకు వరదాయనిగా మారింది.

ఎస్సారెస్పీ అందుబాటులోకి వచ్చిన తరువాత నిర్మించిన కాకతీయ కాలువతో వాగు రెండుగా విడిపోయింది. ఎగువ ప్రాంతంలో హుస్సేన్మియా వాగును పంది వాగుగా వ్యవహరిస్తున్నారు.

రామడుగు మండలంలోని గుట్టలో మొదలై జూలపల్లి మండలం పెద్దాపూర్ చెరువులోకి చేరుతుంది. చెరువు దిగువ ప్రాంతం నుంచి హుస్సేన్మియావాగుగా మారిన పందివాగుకు కాకతీయ కాలువ అడ్డుగా రావడంతో ప్రవాహం నిలిచిపోయింది.

నిబంధనల ప్రకారం కాలువ కింద సైఫన్ నిర్మించాలి. అయితే అది సాంకేతికంగా సాధ్యం కాకపోవడంతో అప్పట్లో ఎస్సారెస్పీ నీరు వాగులోకి వచ్చేందుకు నాటి అధికారులు మౌఖికంగా అంగీకరించారు. దీనిపై ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు లేకపోవడం, ఎస్సారెస్పీలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో పదేళ్లుగా కాలువ నీటిని వాగులోకి వదలడం లేదు. దీంతో వాగు ఆధారంగా పంటలు సాగు చేసే రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. దీనికితోడు నిజాం కాలం నాటి చెక్‌డ్యాంలు శిథిలం కావడంతో వాటి స్థానంలో ఇటీవల కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం చెక్‌డ్యాంల వద్ద ప్రవాహం లేకపోవడంతో దిగువ ప్రాంతాల రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఫలితంగా నాటి ఘటన చోటుచేసుకుంది.

## లేని భూమికి లొల్లి

జగిత్యాల : జగిత్యాల మండలం నర్సింగాపూర్ శివారులో గుట్టపక్కన మట్టి తవ్విన ప్రాంతాల్లో వందలాది మంది గుడిసెలు వేసుకోగా భారీ పోలీసు భద్రత మధ్య తహసీల్ అధికారులు గుడిసెలు తొలగించారు. సర్వే నెంబర్ 437లో 387.21 ఎకరాలు (బంచరాయి) గుట్ట ఉండగా ఖాళీ స్థలం లేకున్నప్పటికీ అనేక మంది గుడిసెలు వేసేందుకు యత్నిస్తుండగా గత ఎన్నికల ముందు భారాస నాయకులు 57 కుల సంఘాలకు భూములు కేటాయించాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఓ సంఘానికి జిల్లా కేంద్రంలోని ధరూర్‌క్యాంపులో విలువైన 10 గుంటల భూమి కేటాయించగా నర్సింగాపూర్ గుట్టకు 57 సంఘాలకు సుమారు 50 ఎకరాలు కేటాయించాల్సిందిగా ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం 34.30 ఎకరాలకు సంబంధించి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో బీసీల కోసం 16 ఎకరాలు, మైనార్టీలకు 10, ఎస్సీలకు 8 ఎకరాలు, ఎస్టీలకు 30 గుంటలు కుల సంఘాల పేరిట కాకుండా సంబంధిత శాఖలకు కేటాయించారు. ఎన్నికల అనంతరం గుట్టపక్క మట్టి తవ్విన ప్రాంతాల్లో కొందరు గుడిసెలు వేసుకున్నారు.


ఓ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజు వందలాది మంది నర్సింగాపూర్ గుట్టవద్దకు వచ్చి గుడిసెలు వేసుకుంటుండగా గత నెలలో జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఇళ్ల స్థలాల కోసం సుమారు 5 వేల దరఖాస్తులు సమర్పించారు. ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని ప్రచారం జోరుగా సాగడంతో జగిత్యాల పట్టణం నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో మహిళలు తండోపతండాలుగా తరలిరావడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, సుమారు 100 మంది పోలీసులు, తహసీల్ అధికారులు నర్సింగాపూర్ గుట్ట వద్దకు వచ్చి జేసీబీలతో గుడిసెలను తొలగించారు. విషయం తెలిసి అనేక మంది మహిళలు తరలిరాగా పోలీసులు పంపించి వేశారు. దీంతో కలెక్టరేట్ వద్దకు వచ్చి బైఠాయించగా పోలీసులు పంపించివేశారు. అంతకుముందే సీపీఎం రాష్ట్ర నాయకులు లెల్లెల బాలక్రిష్ణ, భూతం సారంగపాణి, ఇళ్ల స్థలాల కన్వీనర్ గర్వందుల రమేశ్, జిల్లా నాయకులు సిరికొండ చంద్రయ్య, వెంకటచారి, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శారద తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# కృత్రిమ తోరణం.. పచ్చని హారం

ఖమ్మం : అడవిలో సేదతీరాలంటే ఈ నందనవనం రావాల్సిందే. వర్షాకాలంలో జాలువారే జలపాతం. పచ్చనితోరణంలో నడక. కుటీరంలో కాలక్షేపం. చెట్లకింద బల్లలపై ముచ్చట్లు. మణుగూరులోని రథంగుట్ట అర్బన్ పార్కు వద్ద ఈ అనుభూతులు సాధ్యమవుతాయి. అడవిలో నందనవనంలో పిల్లలను, పర్యాటకులను ఆకర్షించేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో వీటిని పూర్తి చేసి ప్రారంభించనున్నారు. ఈ పార్కుపై ప్రత్యేక కథనం..

జరిగిన పనులు.. తెలంగాణకు హరితహారం కింద రూ.కోటి మంజూరయ్యాయి. 107 హెక్టార్లలో నందనవనం ఉంటుంది. కూర్చునేందుకు 20 బల్లాలు, మూడు పగోడాలు(గుడిసెలు) ఏర్పాటు చేశారు. వీటికి కేరళ కుటీరం, యాగశాల, జపాన్ కుటీరాలుగా పేరుపెట్టారు. ముఖద్వారం నుంచి నందనవనానికి ఇరువైపులా రహదారిని నిర్మించారు. ఇందులో పర్యాటకులు ప్రత్యేకంగా నడిచేందుకు 2 కి.మీ. దారిని ఏర్పాటు చేశారు. పర్యాటకులు కూర్చునేందుకు బల్లలు ఉన్నాయి. ఆరు మరుగుదొడ్లు నిర్మించారు. రాత్రి వేళలో కూడా వెలుతురు కోసం నందనవనం ఆసాంతం సోలార్ దీపాలు అమర్చారు. రెండు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.

త్వరలో చే పట్టేవి... రథంగుట్టపై జలపాతం వర్షాకాలంలో వస్తుంది.



నిరంతరం జలపాతం కోసం సోలార్ పద్ధతి ద్వారా నీటిని గుట్టకు ఎక్కించి కృత్రిమ జలపాతాన్ని ఏర్పాటు చేయనున్నారు. గుట్టపై విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని చూస్తున్నారు. ఇక్కడ తాడుతో వంతెన ఏర్పాటు చేయనున్నారు. పిల్లలను ఆకర్షించేందుకు వివిధ జంతువులు, పక్షులను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. విశ్రాంతి భవనాలను అడవిలో రెండు, మూడు చోట్ల ఏర్పాటు చేయనున్నారు. తినుబండారాలకు క్యాంటిన్, భోజన సదుపాయానికి వంటశాలలు ఉంటాయి.

జంతువులు, పక్షులు ఉంటేనే..

నందనవనంలో జంతువులు, పక్షులు ఉంటేనే ఆదరణ ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవడంతో పార్కు ప్రారంభం ఆలస్యమైంది. వీటికోసం ప్రత్యేకంగా గ్రాసం పెంచుతున్నారు. రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పక్షుల పెంపకానికి ప్రత్యేక బోనులు చేయిస్తున్నారు. ఇలా జరిగితే పాఠశాల పిల్లలకు ఇది విహార కేంద్రంగా మారుతుంది. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు.

సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. త్వరలో వీటిని పూర్తి చేసి ప్రారంభిస్తాం. పర్యాటకులు ఇక్కడకు వచ్చి సేదతీరేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందంగా ఉండే ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు చేస్తున్నాం. ప్రణాళిక ప్రకారం పనులను చేపడుతున్నాం.

# డిగ్రీ పరీక్షల్లో చూచిరాతల పర్వం!


వరంగల్ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 13 నుంచి డిగ్రీ రెగ్యూలర్ పరీక్షలు జరుగుతున్నాయి. 1,81,086 మంది విద్యార్థులకు అధికారులు హాల్‌టికెట్లు జారీ చేశారు. వీరి కోసం వరంగల్‌లో 48, ఖమ్మంలో 33, ఆదిలాబాద్‌లో 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కానీ పరీక్షల్లో చూచిరాతల పర్వం కొనసాగుతోంది. ఇందుకు నిదర్శనమే రోజురోజుకు పెరుగుతున్న డిబార్ల సంఖ్య.

కొరవడిన పర్యవేక్షణ

కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులే మాస్‌కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులను తనిఖీ చేయకుండానే లోపలికి అనుమతిస్తున్నారు. కొందరు చిట్టీలు తీసుకొని వెళ్తున్నారు. ఇన్విజిలేటర్లు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఆకస్మికంగా వచ్చిన తనిఖీ బృందాలకు విద్యార్థులు చిట్టీలతో సహా దొరికిపోతున్నారు. కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడానికి ఈ విధానానికి పాల్పడుతున్నారని పలువురు అధికారులు అభిప్రాయ పడుతున్నారు. వారం రోజుల్లో 171 మంది డిబార్ అయ్యారు.

అనర్హులతో విధులు..

పీజీ పూర్తి చేసిన, ఆయా కళాశాలల్లోని అధ్యాపకులను ఇన్విజిలేటర్లుగా



నియమించాలి. నాలుగు గంటలు విధులు నిర్వర్తిస్తే కేవలం రూ.150 మాత్రమే చెల్లిస్తుండటంతో చాలా మంది ఆసక్తి చూపడంలేదు. గత పరీక్షలకు సంబంధించిన పారితోషికం ఇప్పటి వరకు చెల్లించలేదని వాపోతున్నారు. ఫలితంగా ఏదో కారణం చెప్పి విధులకు దూరంగా ఉంటున్నారు. దీంతో పలు చోట అనర్హులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. వారు విద్యార్థులను కంట్రోల్ చేయకపోవడంతో కేంద్రాల్లో ఎక్కువగా మాస్ కాఫియింగ్ జరుగుతుందని విమర్శలు వస్తున్నాయి.

పరిశీలకుల ప్రేక్షక పాత్ర

ప్రతి కేంద్రానికి ముఖ్య పర్యవేక్షణాధికారితోపాటు ఒక పరిశీలకుడు ఉంటారు. వీరి పర్యవేక్షణలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్ష గదిలోకి అనుమతించాలి. ఇలా కొన్ని చోట్ల జరగడం లేదని, ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంత మంది పరిశీలకులు పరీక్ష ముగియక ముందే వెళ్లిపోతున్నారు. సాధారణంగా పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు, ముగిసిన తర్వాత సమాధాన పత్రాలు ప్యాక్ చేసిన తర్వాత వెళ్లాలని నిబంధనల్లో ఉంది. వీరిపై వర్సిటీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

తనిఖీలు చేపడుతున్నాం - ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ పరీక్షల నియంత్రణ అధికారిపరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపడుతున్నాం. మాస్ కాఫీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులను స్క్వాడ్ బృందాలు పట్టుకొని డిబార్ చేస్తున్నాయి. అనర్హులకు ఇన్విజిలేషన్ చేస్తే తొలగిస్తాం. ఇలాంటి కేంద్రాలపై నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. పరీక్ష ప్రశ్న పత్రం ఆలస్యంగా ఇచ్చినప్పుడు ఆ మేరకు అదనపు సమయం ఇవ్వాలని చీఫ్ సూపరింటెండెంట్‌లు, పరిశీలకులకు సూచించాం.

# పాత వాహనంలో కొత్త సారా..!



ఖమ్మం : గుడుంబాను రూపుమాపేందుకు ఆబ్కారీశాఖ అనేక ప్రణాళికలను రచిస్తోంది. అదే సమయంలో అక్రమార్కులూ సరికొత్త విధానాలు అవలంబించడం పరిపాటిగా మారింది. గతంలో ముఠాలుగా ఏర్పడి మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారు చేసి క్యానుల్లో తీసుకొచ్చి ఊర్లలో అమ్మేవారు. ఆబ్కారీశాఖ వెంటాడటంతో పాత పద్ధతికి స్వస్తి పలికి కొత్త తరహా వ్యాపారానికి తెర లేపారు. ఇందుకోసం పాతబడిన, అతి చౌకగా లభించే ఓ వాహనాన్ని కొనుగోలు చేసి.. దానికి ఏదో ఓ ద్విచక్ర వాహన నంబరు తగిలించి అక్రమ సరకును గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. ముందుగా అనువైన ప్రదేశాలను ఎంచుకొని గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీ మొదలుపెట్టారు. ఇందుకు కావాల్సిన బెల్లం, పటిక ఇతర ముడి పదార్థాలను తుక్కు వాహనాల్లో చేరవేస్తున్నారు. ఇందులో ఒకట్రెండు వాహనాలు ఆబ్కారీ సిబ్బందికి దొరుకుతున్నాయి. కొన్ని ముఠాలు తప్పించుకు తిరుగుతూనే ఉన్నాయి. పట్టుబడితే తుక్కు వాహనాన్ని వదిలేసి స్టేషన్ బెయిల్ తీసుకొని నిందితులు బయటపడుతున్నారు. తిరిగి మరో వాహనంలో అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

కొద్ది మోతాదులోనే...ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దుల్లో గుడుంబా తయారీ కేంద్రాలు విరివిరిగా వెలిశాయి. అమ్మకాలు అక్కడి పరిసరాల్లోనే ఎక్కువగా ఉండటంతో ఎక్కడి వారు అక్కడే తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని ముడి సరకు కావాల్సి వచ్చినప్పుడల్లా ఫోను కొడితే తుక్కు వాహనంలో తీసుకొచ్చే హోల్‌సేల్ వ్యాపారుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో ఆబ్కారీ శాఖ తనిఖీ బృందాలకు ఆలం, బెల్లంతో ఉన్న వాహనాలే దొరికాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ బృందానికి పట్టుబడిన వాటిల్లో ముడి సరకు కేసులే అధికంగా ఉన్నాయి. ఏప్రిల్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం, రెండో పట్టణ స్టేషన్ అధికారులు సంయుక్తంగా ఓ వాహనాన్ని పట్టుకున్నారు. అందులో వంద కిలోల బెల్లం, 175 కిలోల పటిక పట్టుబడింది. ఏడాదిగా పట్టుబడిన కేసులను పరిశీలిస్తే అక్రమార్కులు రూటు మార్చారనే విషయం తేటతెల్లమవుతోంది.

కేసులు నమోదు చేస్తున్నాం

నాగేంద్రరెడ్డి, జిల్లా ఆబ్కారీ అధికారి

తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయి. ఎక్కడా ఉదాసీనతకు తావు లేదు. ఇప్పటికే 850 బైండోవర్లు చేశాం. పూచీకత్తుపై ఉన్న నిందితులు తిరిగి నేరాలకు పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకుంటారు. ఆ విషయం నిందితులకు బాగా తెలుసు. నంబర్ ప్లేట్లు మార్చి వాహనాలు తిరగడం ఇప్పుడు కొత్తేమీ కాదు. అలా తిరుగుతున్నా మేం పట్టుకుంటూనే ఉన్నాం. పోలీసు, ఆర్టీఏ శాఖలతో సమన్వయం చేసుకుంటున్నాం. తనిఖీలూ ఉండేలా ఆయా శాఖల అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందిస్తాం.

అప్పటి నుంచే అనుమానం

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆబ్కారీ శాఖ అధికారులు మధిర చెక్‌పోస్టు వద్ద ఓ భారీ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 30 టన్నుల పటిక ఉంది. అంతటి భారీ మొత్తంలో పటిక పట్టుబడటం ఇదే తొలిసారి. మొదట్లో అక్కడి నుంచి ఇక్కడికి అంటూ ఏదో చెప్పుకొచ్చారు. నిజానికి ఆ భారీ వాహనం గుజరాత్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్న క్రమంలో పట్టుబడింది. మున్సిపాలిటీల్లో నీటి సరఫరా విభాగాలకు నీటిశుద్ధి కోసం దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇందుకోసమే అనుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారీ పరిశ్రమలు ఉండగా గుజరాత్ నుంచి తెప్పించాల్సిన అవసరం ఏమిటని ఆబ్కారీశాఖ ప్రశ్నిస్తోంది. కాలం చెల్లిన వాహనాలను కొనుగోలు చేసి వాటిలో గుడుంబా తయారీ కేంద్రాలకు ముడి సరకును తరలిస్తున్నారనే వాదనకు పట్టుబడుతున్న వాహనాలు, బెల్లం, పటిక బలం చేకూరుస్తున్నాయి. ముమ్మరంగా వాహన తనిఖీలు జరిగితే ఈ అక్రమ రవాణాకు తెర పడుతుంది. ఇది జరిగితే గుడుంబా తయారీ కూడా ఆగిపోతుందనే సూచనలు ఆబ్కారీ శాఖలోనే వినిపిస్తున్నాయి. ఇందుకు ఆబ్కారీశాఖ, పోలీసు, సంయుక్త వ్యూహం రచించాలనే వాదనలున్నాయి.

# కళ కోల్పోతున్న రింగ్ రోడ్డు కూడళ్లు



ఖమ్మం : మూడు వైపులా త్రిభుజాకార ఐలాండ్‌లు, పచ్చని మొక్కలు, ఫౌంటెయిన్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రధాన కూడలిగా ఉన్న తల్లాడ రింగురోడ్డు అది. ఇక్కడి నుంచి భద్రాచలం, ఖమ్మం, సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం, వైజాగ్ ఇలా మూడు వైపులకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఆ కూడలి నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ఆ నిర్మాణాలు గత ప్రాభవానికి గురుతులుగానే మిగులుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సైతం రెండేళ్ల క్రితం ప్రకటించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసం

రింగురోడ్డు నుంచి మూడువైపులా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైజాగ్‌కు పెద్దపెద్ద యంత్రాలను తరలించే లారీలు, కాకినాడకు భారీ గ్రానెట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు మలుపుతిరిగే సమయంలో రింగురోడ్డు గోడలు, ఇనుప గ్రిల్స్, దిమ్మెను తాకుతూ వెళ్లడంతో అవి విరిగిపోతున్నాయి. త్రిభుకార ఐలాండ్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీలు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఆ జాలీల్లో నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్తు దీపాలు సరిగా వెలగక అంధకారంగా మారింది. తల్లాడ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసినా వాటి వెలుగులు సరిపోవడం లేదు.

దారిలో కలిసిన డివైడర్

తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు డివైడర్ ఉంది. ప్రతి సంవత్సరం రహదారులు నిర్మిస్తుండటంతో రోడ్డు ఎత్తు పెరిగి డివైడర్‌కు సమానమైంది. వాహనదారులు డివైడర్‌పై నుంచీ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తల్లాడ రింగురోడ్డుకు పూర్వవైభవం తీసుకురావాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారి విస్తరించి.. డివైడర్లు విస్మరించి

మధిర-విజయవాడ రోడ్డులో ఎర్రుపాలెంలోని ప్రధానమైన రింగ్ కూడలిలో రహదారి విస్తరించిన అధికారులు ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవటంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. విజయవాడకు ప్రధాన రహదారి కావటంతో వాహనాల రద్దీ పెరుగుతోంది. మధిర, విజయవాడ వైపు ఉన్న రహదారుల్లో డివైడర్లు ఏర్పాటు చేయకపోవటంతో వేగంతో వచ్చి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రింగ్‌లో ఫౌంటెయిన్ నిర్మించకుండా వదిలేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నిధులు కేటాయించి, డివైడర్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు పడగానే తల్లాడ రింగురోడ్డు కూడలిలో మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దుతాం. అవకాశం ఉంటే తల్లాడ రింగురోడ్డు కూడలిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో రింగురోడ్డు కూడలి ఉన్నది. ఈ రింగురోడ్డును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులదే. ఆ అధికారులు రింగురోడ్డు కూడలి గురించి పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీకి సంబంధం లేదు.

బి.రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ, తల్లాడ

# బడిబాట.. విజయబావుటా


కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఈ విద్యా సంవత్సరం ముందు నుంచి నిర్వహించిన 'బడిబాట' ఉభయ జిల్లాల్లో విజయవంతమైంది. ఈ నెల 3 నుంచి 17 వరకు 'ఆచార్య జయశంకర్ బడిబాట' కార్యక్రమం చేపట్టారు. మండుటెండల్లోనూ అధికారులు, ఉపాధ్యాయులు చొరవచూపి విద్యార్థులను గుర్తించారు. ఆపై ప్రవేశాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమ ప్రవేశం, 'మన ఊరు - మన బడి' పథకంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాలయాలకు పంపేందుకు మొగ్గుచూపారు. ఫలితంగా ఒకటో తరగతిలో ఖమ్మం జిల్లాలో 3,974, భద్రాద్రి జిల్లాలో 5,036 ప్రవేశాలు దక్కాయి. రెండు నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉభయ జిల్లాల్లో కలిపి 4,343 మంది విద్యార్థులు చేరడం విశేషం. మొత్తం ప్రవేశాల్లో ప్రైవేటు విద్యాలయాల నుంచి వచ్చినవారు 4,495 మంది ఉన్నారు. తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల ఏర్పాటు, రాతపుస్తకాల పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి అంశాలు కలిసొచ్చాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

# మూగబోయిన ప్రజావాణి

వరంగల్ : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం వివిధ పరిపాలన పరమైన కారణాలు, దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో నెల రోజుల నుంచి మూగబోయింది. నేరుగా తమ సమస్యలను కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు విన్నవించుకుందామనుకునే వారికి నిరాశే ఎదురవుతోంది. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయంగా ఫోన్ ద్వారా సమస్యలు వినేందుకు రూపొందించిన డయల్ యువర్ కలెక్టర్, ఫోన్‌ఇన్ తదితర ప్రజా అనుసంధాన కార్యక్రమాలకు గతంలోనే చరమ గీతం పాడారు. దీంతో తమ గోడు వినేవారే కరవయ్యారా అని సామాన్య జనం నిస్సహాయంగా ప్రశ్నిస్తున్నారు.

వారధి' ఏమైంది..?

జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్ వరకు రాకూడదని అప్పటి కలెక్టర్ బి.గోపి ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా 'వారధి గ్రీవెన్స్ యాప్' రూపొందించారు. ప్రజలకు దూరాభారం తగ్గించి, తక్షణ పరిష్కార మార్గాలను చూపించేందుకు రూపొందించిన యాప్ నిర్వహణ ఆయన బదిలీతో అటకెక్కింది. యాప్ రూపకల్పన, నిర్వహణ బాధ్యతలను హైదారాబాద్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ వీమ్యాక్స్ కంపెనీకి అప్పగించారు. ఏడాది కాలంపాటు జిల్లాలోని వివిధ శాఖల వారి వివరాలను సేకరించి సాధారణ పౌరులు ఫిర్యాదు చేసేందుకు ఓ యాప్, వాటిని చూసి పరిష్కరించేందుకు జిల్లాలోని అధికారులకు ఓ యాప్ కేటాయించారు. ఏ శాఖకు సంబంధించిన సమస్య ఉంటే పౌరులు యాప్‌లో సూచించిన విధంగా ఫిర్యాదులు నమోదుచేయవచ్చు. వెంటనే మరో యాప్ ద్వారా అధికారులకు




ఫిర్యాదులు అందుతాయి. ఉదాహరణకు ఓ రైతుకు భూమికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం యాప్‌లోని 'రెవెన్యూ ఆప్షన్' ఎంచుకుని ఫిర్యాదు నమోదుచేయాలి. దాంతో నేరుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందుతుంది. సమస్య పరిష్కారం ఏ దశకు వచ్చిందో తెలుసుకునేందుకు కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా యాప్‌లోనే పరిశీలించుకునే సౌలభ్యం ఉంది. పరిష్కారంలో జాప్యం జరిగితే యాప్ ద్వారానే ఉన్నతాధికారులనూ సంప్రదించే అవకాశం కల్పించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధి నుంచి రూ.లక్షలు ఖర్చుచేసి రూపొందించిన యాప్ ప్రజల్లోకి వెళ్లకముందే నిర్వీర్యమైపోయింది. గ్రీవెన్స్ యాప్ నిర్వహణ గురించి కలెక్టర్ ప్రావీణ్య ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే తిరిగి వినియోగంలోకి వచ్చే అవకాశముంది. కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం..:- శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవోఈ ఏడాది మార్చిలో అప్పటి కలెక్టర్ గోపి వారధి గ్రీవెన్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పూర్తిస్థాయిలో అమలులోకి రాకముందే ఆయన బదిలీపై వెళ్లారు. ప్రత్యేక గ్రీవెన్స్ యాప్ నిర్వహణ, అమలుకు సంబంధించిన వివరాలను దశాబ్ది ఉత్సవాల తర్వాత కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి తీసుకెళతాం. ప్రజావాణి రద్దయినా కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించాల్సిందిగా అధికారులకు సూచించాం.

# మూత్రశాల ఆవరణలోనూ వ్యాపారమే!

ఎనుమాముల : లక్ష్మీపురం నూతన మోడల్ కూరగాయల మార్కెట్‌లో అడ్డదారుల్లో అడ్డాలను సంపాదించిన వారు వాటిని రూ.లక్షల్లో అమ్మకానికి పెడుతున్నారు. కూరగాయల మార్కెట్ బస్టాండు వైపు ఉన్న ద్వారం పక్కనే నిర్మించిన మూత్రశాల ఆవరణను ఓ వ్యాపారి ఏడాదికి రూ.లక్ష చొప్పున ఇతరులకు అద్దెకు ఇచ్చారు. మార్కెట్‌కు వచ్చే వారు మూత్రశాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసి మరీ కూరగాయలను విక్రయిస్తున్నారు. ఏడాదిన్నర నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా.. మార్కెట్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. వ్యాపారికి వచ్చే మొత్తంలో కొంత వాటా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పోతోందని తెలుస్తోంది.

ఒక్కొక్కరికి 3 నుంచి 4 అడ్డాలునూతన మార్కెట్‌లో చిల్లర వ్యాపారులకు కూరగాయలను విక్రయించేందుకని 4/4, 6/6, 8/8 అడుగుల విస్తీర్ణంలో అడ్డాలను కేటాయించారు.

ఒక్కో అడ్డాకు రూ.300 నుంచి 800 వరకు విస్తీర్ణాన్ని బట్టి నెలవారీ అద్దె చెల్లిస్తున్నారు. వాటితో పాటు కవర్ షెడ్డులో 158 ప్లాట్‌ఫాంలు నిర్మించినా గిరాకీ లేదని ఇతరులకు అమ్ముకున్నారు. ఇప్పటికీ అర్హులకు అడ్డాలు రాలేదని కొందరు మార్కెట్ కార్యాలయం చుట్టూ తిరుగతున్నారు. మరోవైపు ఒక్కో వ్యాపారికి 3 నుంచి 4 అడ్డాల్లో వ్యాపారం సాగిస్తున్నారు. నెలవారీ అద్దె మాత్రం ఒకే అడ్డాకు చెల్లిస్తుండడంతో.. మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది. మార్కెట్‌లోని ఒక్కో కమిషన్ వ్యాపారికి కమిషన్ దుకాణంతో పాటు 3 నుంచి 4 అడ్డాలు వారి బినామీ పేర్లపై ఉన్నాయి.. వాటిని స్థానిక గుమస్తాలకు అద్దెకు ఇస్తూ.. ప్రతి నెలా లాభాలను ఆర్జిస్తున్నారు.

కమీషన్ వ్యాపారుల చిల్లర వర్తకం..కూరగాయల మార్కెట్‌లో తొలుత నిర్మించిన 82 దుకాణాలతో పాటు ఇటీవల నూతనంగా నిర్మించిన 14 దుకాణాలతో కలుపుకుని మొత్తం 96 కమిషన్ దుకాణాల్లోని వ్యాపారులు 70 శాతం చిల్లర వర్తకం కొనసాగిస్తున్నారు. సాధారణంగా కమిషన్ వ్యాపారులు ఎక్కువ మొత్తంలో వివిధ ప్రాంతాల నుంచి రైతుల నుంచి కొనుగోలు చేసిన సరకును కూరగాయల మార్కెట్‌లో చిల్లర వర్తకులకు కమిషన్‌పై విక్రయించాల్సి ఉంటుంది. లక్ష్మీపురం మార్కెట్‌లో మాత్రం కమిషన్ వ్యాపారులూ చిల్లర వర్తకులతో పోటీగా కూరగాయల అమ్మకాలు జరుపుతుండడంతో.. తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని చిల్లర వర్తకులు వాపోతున్నారు.చర్యలు తీసుకుంటాం.. -బి.వి.రాహుల్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిమార్కెట్‌లోని అడ్డాలపై కూరగాయలు విక్రయించకుండా ఇతరులకు అద్దె ప్రాతిపదికన ఇస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.




దిల్లీ: అక్రమాస్తుల కేసులో సీఎం జగన్ బెయిల్ రద్దు సహా ఇతరులపై నమోదైన కేసుల విచారణను తెలుగు రాష్ట్రాల నుంచి బదిలీ చేయాలని ఎంపీ రఘురామ వేసిన వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇందుకు తాము బాధ్యులం కాదని సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పగా.. ఎవరు బాధ్యత వహిస్తారని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ప్రశ్నించింది. లోయర్ కోర్టులో వాయిదాలతో తమకు సంబంధం లేదని తుషార్ మెహతా పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థకు సంబంధం లేకపోతే ఎవరికి ఉంటుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు.

**సమయమిచ్చి ఉపయోగం ఏంటి?** ప్రజాప్రతినిధులపై దాఖలైన పిటిషన్‌లను వేగంగా విచారించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఈ సందర్భంగా జగన్ తరఫు న్యాయవాదులు ప్రస్తావించారు. అందుకని విచారణ ముగించాలని కోరారు. హైకోర్టు సుమోటోగా ఆదేశాలు ఇచ్చినందున 3 నెలల గడువు ఇవ్వాలని, ఆ తర్వాత పరిశీలన జరపాలని వాదించారు. తాము ఈ పిటిషన్‌లపై విచారణ ముగించడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. సమయమిచ్చి ఉపయోగం ఏంటని, ఫలితం ఎక్కడా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఇన్నిసార్లు వాయిదాల పడటం, ఇంత కాలయాపన ఏంటని అసహనం వ్యక్తం చేసింది.

**ఒక్క డిశ్చార్జ్ పిటిషన్ అయినా పరిష్కరించారా?** రాజకీయ దృక్పథంతో పిటిషనర్ ఇక్కడ పిటిషన్ దాఖలు చేశారని జగన్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. వైకాపా ఆయనపై చర్యలు తీసుకోవడంతో మూడేళ్లుగా పార్టీ కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రఘురామపై అనర్హత పిటిషన్ దాఖలు చేసినందునే ఇక్కడ ఈ పిటిషన్లు దాఖలు చేశారన్నారు. తాము రాజకీయ వ్యవహారాలను పరిశీలించడం లేదని, కేవలం న్యాయపరమైన అంశాలనే పరిశీలిస్తున్నట్లు జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందనేది ఇక్కడ ప్రధానాంశమని, ఇంతకాలం నుంచి ఒక్క డిశ్చార్జ్ పిటిషన్ అయినా పరిష్కరించారా? అని ప్రశ్నించారు. తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 15న పలుకుబడి ఉన్న వ్యక్తులు కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినందున.. ఏం జరుగుతుందో చూద్దామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్‌లో చేపట్టనున్నట్లు తెలిపింది.




దిల్లీ: విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ భూములను లేఅవుట్ చేసి అమ్మకాలు చేపట్టడంపై స్టే విధిస్తూ.. ఏపీ ప్రభుత్వం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. 2003 సెప్టెంబర్ 13న ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న అవసరాలకు మినహా ఎలాంటి కార్యకలాపాలకు ఆ భూములు ఉపయోగించకూడదని ఆదేశించింది. సినీ అవసరాలకు వినియోగించేందుకు 35 ఎకరాల భూమిని 2003లో అప్పటి ప్రభుత్వం కేటాయించింది. కోస్టల్ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ చేసి ఇతర కార్యకలాపాలకు వినియోగించేందుకు వైకాపా ప్రభుత్వం అనుమతించింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉన్నత న్యాయస్థానం కేసు కొట్టివేయడంతో.. ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. భూమిని ఎందుకు కేటాయించారు? ప్రస్తుతం లేఅవుట్ వేశారా? కార్యకలాపాలు చేపట్టారా? అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. సినీ స్టూడియో నిర్మాణానికి భూములు కేటాయించారని, అందుకు అనుగుణంగా అక్కడ ఎలాంటి పనులు చేపట్టకుండా లేఅవుట్ వేసి అమ్మకాలకు సిద్ధం చేశారని ధర్మాసనం దృష్టికి ఆయన తీసుకువచ్చారు. దీంతో స్టే విధించిన సుప్రీంకోర్టు.. ఈ ఏడాది మార్చి 11లోపు స్పందించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం, ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది.




వెంకటగిరి: రాష్ట్రంలో ఏ వర్గమూ సంతోషంగా లేదని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. వైకాపా ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని.. 82 రోజుల్లో పతనం తప్పదన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన 'రా.. కదలిరా..' సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, వైకాపా నేతల తీరుపై మండిపడ్డారు. జగన్‌ను గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

"'రా.. కదలి రా..' అని పిలుపిస్తే వెంకటగిరి గర్జించింది. జగన్ రాజకీయ వ్యాపారి. మనందరినీ పెట్టుబడిగా పెట్టి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు. వైకాపాలో ఉంటూ జగన్ పాలన బాగోలేదని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ప్రజాహితం కోసం మాట్లాడితే ఆయన్ను దూరం పెట్టేశారు. సీనియర్లను కూడా లెక్కచేయని అహంకారం జగన్‌ది. ఈ సీఎం వెయ్యి తప్పులు చేశారు..

ఇంకా భరిస్తారా? జీతం కోసం అడిగితే ఉద్యోగులు జైలుకు వెళ్లే పరిస్థితి రాష్ట్రంలో ఉంది. వైకాపా అధికారంలోకి వచ్చాక వెంకటగిరి తలరాత మారిందా? 25 ఏళ్ల క్రితం యువతకు ఐటీ అనే ఆయుధమిచ్చా.. అదే ఇప్పుడు వజ్రాయుధమైంది. తెదేపా హయాంలో తిరుపతిని మొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాం. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలు ఉపయోగించాలి" అని చంద్రబాబు కోరారు.




షోలాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం మహారాష్ట్రలో పర్యటించారు. షోలాపూర్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ పథకం కింద పేద ప్రజలకు ఇళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. "పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన దేశంలోనే అతిపెద్ద సొసైటీని నేడు ప్రారంభించాం. దీనిపై 2014లో నేను హామీ ఇచ్చా. ఆ వాగ్దానం నెరవేరడం, దాన్ని చూడటానికి రావడం.. ఇవన్నీ పరిపూర్ణ క్షణాలు. ఈ ఇళ్లను చూడగానే బాల్యం గుర్తొచ్చింది. చిన్నతనంలో నాక్కూడా ఇలాంటి ఇంట్లో నివసించే అవకాశం వస్తే ఎలా ఉండేదో అని ఆలోచించా" అంటూ గద్గద స్వరంతో మాట్లాడారు. కన్నీళ్లను దిగమింగుకుని తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం గురించి ఆయన ప్రస్తావించారు. ఆ మహోన్నత ఘట్టాన్ని పురస్కరించుకుని 22వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో రామజ్యోతి వెలిగించాలని మరోసారి పిలుపునిచ్చారు. "శ్రీరాముడి నిజాయతీని మా ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంది. మన విలువలు, కట్టుబాట్లను గౌరవించాలని ఆ భగవంతుడు బోధించాడు. అదే బాటలో నడుస్తూ పేదల సంక్షేమం, వారి సాధికారత కోసం మేం పనిచేస్తున్నాం" అని ప్రధాని తెలిపారు. ప్రజల కలలే తమ ప్రభుత్వ హామీలని మోదీ అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు అందరికీ చేరువకాకపోవడంతో 'గరీబీ హఠావో' కేవలం నినాదంగా మిగిలిపోయిందని ప్రతిపక్షాలను విమర్శించారు. తమ పాలనలో చిట్టచివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## అప్పటి నుంచే నాపై కక్షగట్టారు: ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికింది ఉమ్మడి నెల్లూరు జిల్లాయేనని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈ జిల్లా నుంచే ముగ్గురు ఎమ్మెల్యేలం అధికార పార్టీని వీడి తెదేపా అధినేత చంద్రబాబుతో నడిచేందుకు వచ్చామన్నారు. వెంకటగిరిలో నిర్వహించిన 'రా.. కదలి రా..' సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మాఫియా గ్యాంగ్‌లు పెరిగిపోయాయని.. దానిపై గతంలో పోలీసుల సభలోనే మాట్లాడినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. రాష్ట్రమంతా ఈ సంస్కృతి పెరిగిపోయిందని చెప్పానన్నారు. అప్పటి నుంచే తనపై కక్షగట్టారని.. వెంకటగిరికి ఏది కావాలని అడిగినా.. ఆ అభ్యర్థనలను చెత్తబుట్టలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవులు కావాలని తాను అడగలేదని.. పట్టణానికి వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, సోమశిల–స్వర్ణముఖి లింక్ కాలువకు నిధులు కోరితే బుట్టదాఖలు చేశారన్నారు. గ్రామ పంచాయతీలు, ఇతర స్థానిక



సంస్థల నిధులు మళ్లించారని.. ఆ డబ్బు ఇవ్వాలని కోరితే తన నియోజకవర్గ ప్రజలను సీఎం జగన్ ఇబ్బంది పెట్టారన్నారు. సోమశిల ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తెదేపా–జనసేన కూటమిని గెలిపించాలని రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

## ఏపీలో వైఎస్ షర్మిల పర్యటన షెడ్యూల్ ఖరారు



అమరావతి: ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి రెండు రోజుల రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రేపు, ఎల్లుండి అంటే 20, 21వ తేదీలలో షర్మిల ఏపీలో పర్యటించనున్నారు. ఈ నెల 20న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2 గంటలకు షర్మిల ఇడుపులపాయకు బయలుదేరుతారు. సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించనున్నారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేయనున్న షర్మిల.. 21న కడప నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు.

విజయవాడలో ఉదయం 11 గంటలకు పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వైఎస్సార్టీపీని షర్మిల కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన షర్మిలకు పార్టీ అధిష్టానం పెద్ద బాధ్యతలే అప్పగించింది. షర్మిలను ఏపీపీసీసీ చీఫ్‌గా కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను షర్మిలకు కాంగ్రెస్ హైకమాండ్ అప్పగించింది. అంతకుముందు ఏపీసీసీ చీఫ్‌గా ఉన్న గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా అధిష్టానం నియమించింది.

## 22న ఏపీ సర్కార్ సెలవు ప్రకటించకపోవడం శోచనీయం

విశాఖపట్నం, జనవరి 19: దేశమంతా అయోధ్య రామ మందిర ప్రారంభ వేడుక చేసుకుంటోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 22న రామమందిరం ప్రారంభోత్సవానికి అన్ని రాష్ట్రాలు సెలవులు ప్రకటించారని... కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హిందువుల మనోభావాలు కాపాడవలసిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌కు ఉందన్నారు. 22న తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**వైసీపీ నామరూపాలు లేకుండాపోతుంది..** రెండు నెలల తర్వాత వైసీపీ అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు 17 సీట్లు కూడా రావని.. వైసీపీ పార్టీ నామరూపాలు లేకుండా పోయే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. జగన్ రాష్ట్రంలో ప్రజల నుంచి దోచుకున్న సొత్తుతో ఎన్నికలకు పోటీ చేయడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో చీప్ లిక్కర్ ఏరులై పారుతోందన్నారు. రాష్ట్రంలో దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. 2024 సాధారణ ఎన్నికలలో 110 స్థానాల్లో తిరుపతి తరహా కుట్రకు జగన్ సిద్ధంగా ఉన్నారని విష్ణుకుమార్ రాజు ఆరోపించారు.

## 83 రోజుల తర్వాత ఎవరూ కనిపించరు.. వైసీపీపై బోండా ఉమా విమర్శలు



అమరావతి : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, వైసీపీపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రెడ్డి, సజ్జల ఆదేశించారని తప్పులు చేసే అధికారులకు ఐఏఎస్ అధికారి గిరీశాకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఎన్నికల అనంతరం జగన్ రెడ్డి దేశం విడిచి పోతారని.. అతన్ని నమ్ముకొని తప్పులు చేసే అధికారులు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. జగన్ రెడ్డి పాలన ఉండేది కేవలం 83 రోజులే అని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఆదుకుంటాం.... రక్షిస్తామన్న ఏ నాయకుడు కనిపించడనే వాస్తవం అధికారులు గ్రహిస్తే మంచిదని ఆయన హితవుపలికారు. తిరుపతి ఉపఎన్నికలో ఆర్వోగా నాడు చేసిన తప్పులకు, నేడు కలెక్టర్‌గా ఉన్న గిరీశా సస్పెండ్ అయ్యారన్నారు. అతనితో పాటు మంత్రిపెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలను కూడా ఎన్నికల సంఘం శిక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వెంటనే విచారణ చేపట్టాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు. గిరీశాను సస్పెండ్ చేసినట్టే ప్రతాపరెడ్డి, రిష్వంత్ రెడ్డి, హరినారాయణ, పరమేశ్వర్ రెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఎవరి ఆదేశాలతో దొంగ ఓట్లు సృష్టిస్తున్నారో, అర్హుల ఓట్లు తొలగిస్తున్నారో, ఇష్టానుసారం ఫామ్–7లు ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారో అన్ని ఆధారాలు సేకరిస్తున్నామని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు తప్పులు చేస్తున్న అధికారులపై ఫిర్యాదు చేస్తూనే ఉంటామన్నారు. సీఐలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, ఎస్పీలు, కలెక్టర్లుగా ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని టీడీపీ నేత హెచ్చరించారు.

**ఫ్రస్ట్రేషన్‌లో కొడాలి నాని...** కొడాలి నానీ వేస్ట్ ఫెలో అని.. అహంకారపు పొరలు కమ్మి టీడీపీ సభకు వచ్చిన జనం నానీకి కనిపించడం లేదని మండిపడ్డారు.

రా.. కదలిరా సభకు వచ్చిన లక్షమందికి పైగా జనాన్ని చూసి కొడాలినానీ ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారన్నారు. 83 రోజుల తర్వాత జగన్ రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి సహా ఎవరూ కనిపించరని బోండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు.

## రాహుల్ న్యాయ్ యాత్రపై అస్సాంలో కేసు నమోదు



కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ చేపడుతున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై అస్సాంలో కేసు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి యాత్ర రూట్స్‌లో మార్పులు చేయడంతో పోలీసులు.. యాత్ర నిర్వాహకుడు కేబీ బైజుపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం రాహుల్ యాత్ర అస్సాంలోని జోర్హాట్ పట్టణంలో కొనసాగుతోంది. అయితే తాము ముందుగా నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలోకి యాత్రను మళ్లించినట్లు అస్సాం పోలీసులు తెలిపారు. చార్టులో చూపించని మార్గాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. రూట్‌ను అకస్మాత్తుగా మార్చడం అంతరాయాలకు దారితీసినట్లు తెలిపారు. యాత్ర నిర్వాహకులు, సహ నిర్వాహకులు ట్రాఫిక్ బారికేడ్‌లను బద్దలు కొట్టేలా అక్కడి సమూహాన్ని ప్రేరేపించారని ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసు అధికారిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. కాగా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై కేసు నమోదు చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. యాత్రకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కాంగ్రెస్‌కు చెందిన అస్సాం ప్రతిపక్ష నేత దేబబ్రత సైకియా మండిపడ్డారు. ట్రాఫిక్ మళ్లింపు దగ్గర పోలీసులెవరూ లేరని చెప్పారు. యాత్ర కోసం తమకు కేటాయించిన మార్గం చాలా ఇరుకుగా ఉందని, జనాలు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో కొన్ని మీటర్ల పాటు పక్కనున్న దారి గుండా ప్రయాణించాల్సి వచ్చిందని వివరించారు. రాహుల్ న్యాయ్ యాత్ర విజయవంతమవుతోందన్న భయంతోనే.. సీఎం హిమంత శర్మ తమ యాత్రకు ఆటంకం కలిగించాలనుకుంటున్నారని ఆరోపించారు.

## మినీ డ్రెస్ లో అందాల ఊర్వశి

2015లో మిస్ దివా యూనివర్స్ టైటిల్ ను గెలుచుకున్న ఊర్వశి రౌటేలా బాలీవుడ్ తో పాటు సౌత్ సినిమాల్లో అందాల ఆరబోత పాత్రల్లో నటించడం ద్వారా మంచి గుర్తింపు దక్కించుకుంది. గత ఏడాది ఏకంగా నాలుగు తెలుగు సినిమాల్లో ఐటం సాంగ్ లో కనిపించి మెప్పించిన ముద్దుగుమ్మ ఊర్వశి రౌటేలా ఈ సారి కూడా మరింత సందడి చేయబోతుంది. వెండి తెరపై మాత్రమే కాకుండా ఈ అమ్మడి అందాల ఆరబోత సోషల్ మీడియాలో కూడా కంటిన్యూ చేస్తోంది. రెగ్యులర్ గా ఇన్ స్టా లో ఊర్వశి అందాల ఆరబోత ఫోటోలను షేర్



చేస్తూ ఉంటుంది. అందుకు తగ్గట్లుగానే ఈ అమ్మడి యొక్క ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా మరోసారి మినీ డ్రెస్ లో థైస్ అందాలను ఎక్స్ పోజ్ చేస్తూ టాప్ టూ బాటమ్ అందమైన తన రూపంను ప్రదర్శించడం ద్వారా ముద్దుగుమ్మ ఊర్వశి రౌటేలా వైరల్ గా మారింది. ఆకట్టుకునే అందంతో పాటు మినీ డ్రెస్ లో ఈమె స్కిన్ షో కి అంతా ఫిదా అవుతున్నారు. ఈ మధ్య కాలంలో హీరోయిన్ గా కంటే కూడా అధికంగా ఈమెకు ఐటం సాంగ్ లో నటించే అవకాశాలు వస్తున్నాయి. అయినా కూడా వాటితో ఎక్కువ గుర్తింపు దక్కించుకుంది. ఈ ఏడాది ఆమె నుంచి మరో అరడజను సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయి అనే టాక్ వినిపిస్తోంది.

## ఫిట్‌నెస్ ఫ్రీక్ ట్రెడిషనల్ వెడ్డింగ్ లుక్

2023లో విడుదలైన స్కూప్ చిత్రంతో కరిష్మా తన్నా పేరు మరోసారి మార్మోగింది. 2024లో మరింత బెటర్ పెర్ఫామెన్స్ తో ఆకట్టుకునే సమయం ఆసన్నమైంది. ఇంతలోనే కరిష్మా తన్నా భర్త వరుణ్ బంగేరాతో కలిసి ఫిట్‌నెస్‌కు సంబంధించిన వ్యాపారంలోకి అడుగుపెట్టింది. వారి మొదటి వ్యాపార సంస్థ ప్రారంభమైంది. భార్యాభర్తలు ఇరువురు కలిసి కొత్త యుగపు ఫిట్‌నెస్ పరికరాలలో పెట్టుబడి పెట్టారు. ఇందుకోసం మొదటి జిమ్‌ను ముంబై- బాంద్రాలో ఏర్పాటు చేస్తున్నారు. కరిష్మా - వరుణ్ తమ వ్యాపారం కోసం ఫిట్‌నెస్ పరిశ్రమను ఎంచుకోవడానికి కారణం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణ. దీని గురించి కరిష్మా మాట్లాడుతూ, ఈ విషయాన్ని ప్రకటించినప్పుడు నేను చాలా ఉద్వేగానికి లోనయ్యాను. కానీ మేం ఫిట్‌నెస్ సంబంధిత వ్యాపారంలోకి ప్రవేశించాము.



ఇది TC1 ద్వారా E.M.S ట్రైనింగ్ అనే కొత్త యుగ శిక్షణ కాన్సెప్ట్ తో వస్తోంది. . ఈ కాన్సెప్ట్ ప్రపంచవ్యాప్తంగా స్వీకరిస్తున్న ప్రక్రియ. తక్కువ వ్యవధిలో అద్భుతమైన ఫలితాలను చూపించే ఫిట్‌నెస్ విధానం ఇది. ఈ కాన్సెప్ట్‌ను మా మొట్టమొదటి వ్యాపార వెంచర్‌గా భారతదేశంలోకి తీసుకురావడానికి మేము చాలా సంతోషిస్తున్నాము అని తెలిపారు.

**ఈ ఫోటోషూట్ వెరీ స్పెషల్ :** ఇంతలోనే కరిష్మా తన్నా స్పెషల్ మ్యాగజైన్ షూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఈ కొత్త లుక్ లో పసుపు, ఆకుపచ్చ రంగు డిజైనర్ డ్రెస్ లో చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. కల్చర్ డ్ వెడ్డింగ్ టైటిల్ కి తగ్గట్టుగా ఎంపిక చేసుకున్న డిజైనర్ దుస్తులు ఎంతో యాప్ట్ గా కనిపిస్తున్నాయి. కరిష్మా తన్నా ఈ డ్రెస్ లో ఎంతో అందంగా కనిపిస్తోంది. ఇక పసుపు రంగు లాంగ్ పరికిణీపై అద్భుతమైన డిజైన్లు ఎంబ్రాయిడరీ వర్క్ తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





## కుటుంబ సమేతంగా ఈ ట్రిప్ కి వెళ్లారా?



రౌడీ బోయ్ విజయ్ దేవరకొండ- రష్మిక మందన జంట స్నేహం, డేటింగ్ గురించి నిరంతరం సోషల్ మీడియాల్లో చర్చ సాగుతూనే ఉంది. ఆ ఇద్దరూ కలిసి విదేశీ విహారయాత్రలకు వెళ్లారన్న ప్రచారం ఉంది. ప్రతిసారీ వెకేషన్ పేరుతో ఈ జంట విదేశాలకు వెళ్లినా దానిని సీక్రెట్ గా దాచేస్తున్నారనేది అభియోగం. కొందరు అభిమానులు సీక్రెట్ డేటింగ్ అంటూ పలుమార్లు ఆ ఇద్దరూ షికార్లు చేసిన రెస్టారెంట్లు, షాపింగ్ ప్లేసెస్ తాలూకా ఫోటోలను షేర్ చేసారు. అయితే ఒకే సమయంలో విజయ్ – రష్మిక ఇద్దరూ ఇన్ స్టాలో షేర్ చేసే ఫోటోలు కూడా రకరకాల సందేహాలను రేకెత్తిస్తుంటాయి. ఇప్పుడు కూడా అలాంటి ఒక ట్రిప్ నుంచి ఆ ఇద్దరూ అభిమానులు టీజ్ చేయడంతో మరోసారి సీక్రెట్ ట్రిప్ వెళ్లారంటూ ప్రచారం సాగుతోంది. ఈ జంట ఇటీవల వియత్నాం అందాలను ఆస్వాధించేందుకు వెళ్లారని కామెంట్ చేస్తున్నారు. దానికి కారణం వారం వ్యవధిలో విజయ్, రష్మికలు షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులే. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల్లో జంటగా కనిపించిన ఈ జోడీ నాటి నుంచి నిష్కల్మషమైన స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ఇరువురి కుటుంబాల నడుమ సాన్నిహిత్యం బలపడింది. జంటగా వెకేషన్లకు వెళ్లడం, వేడుకల్లో కనిపించడంతో ఇద్దరి మధ్యా ఏదో నడుస్తోందన్న పుకార్లు వచ్చాయి కానీ వారు ఫ్యామిలీ ఫ్రెండ్స్ గాను ధృఢమైన బంధాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ఇద్దరూ కేవలం స్నేహితులం మాత్రమేనని, పెళ్లి పై వస్తున్న వార్తలు అవాస్తవమని కూడా ఖండించినా రిపీటెడ్ గా ఇవే పుకార్లు పుట్టుకొస్తున్నాయి. ఆసక్తికరంగా ఈసారి వియత్నాం ట్రిప్ లో విజయ్ దేవరకొండతో పాటు తన సోదరుడు ఆనంద్ దేవరకొండ కూడా కనిపించాడు. దీనిని బట్టి కుటుంబ సమేతంగా ఈ ట్రిప్ కి వెళ్లారా? అన్న సందేహాలు రేకెత్తాయి. వియత్నాంకి కలిసే వెళ్లి ఉండొచ్చు... కానీ కుటుంబంతో! అని కూడా కొందరు భావిస్తున్నారు. మొత్తానికి విజయ్, రష్మికల ఇన్ స్టాకు కొంత గ్యాప్ తర్వాత ఇప్పుడు ఫాలోవర్స్ మరింతగా పెరిగే ఛాన్స్ దొరికిందన్నమాట.

## ప్రభాస్ పై తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రాజాసాబ్ మూవీ తెరకెక్కుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. పాన్ ఇండియా ఇమేజ్ తో దూసుకుపోతున్న ప్రభాస్ మారుతితో సినిమా చెయ్యడం ఏంటి అని అందరూ షాక్ అయ్యారు. అయితే రెగ్యులర్ గా సీరియస్ కంటెంట్ లతో మూవీస్ చేస్తూ ఉండటం వలన కాస్తా రీఫ్రెష్మెంట్ కోసం కంప్లీట్ కామెడీ టచ్ ఉన్న క్యారెక్టర్ తో ఈ మూవీ చేస్తున్నాడంట. ఇప్పటికే 50 శాతం షూటింగ్ కంప్లీట్ అయ్యింది. తాజాగా మూవీ టైటిల్ ని ఎనౌన్స్ చేశారు. లుంగీలో ప్రభాస్ ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేశారు. దీంతో మూవీ ఎలా ఉండబోతోంది అనేది ఒక స్పష్టత వచ్చేసింది. నిజానికి ప్రభాస్ తో ఈ రోజుల్లో సినిమా చేయాలంటే కచ్చితంగా 200 నుంచి 300 కోట్లు బడ్జెట్ సిద్ధం చేసుకోవాల్సిందే. కంటెంట్ స్పాన్ పెరగడంతో ఆ స్థాయిలో బడ్జెట్ లు ఖర్చవుతున్నాయి. అయితే మారుతి మాత్రం రాజాసాబ్ చిత్రాన్ని కేవలం 60 నుంచి 70 కోట్ల బడ్జెట్ లోనే పూర్తి చేయబోతున్నాడంట. ఈ చిత్రానికి ప్రభాస్ ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోకుండా వర్క్ చేస్తున్నాడు. మూవీ రిలీజ్ అయ్యాక లాభాల్లో వాటా మాత్రం తీసుకుంటాడంట. అలాగే ఈ చిత్రం కథ మొత్తం కంప్లీట్ గా ఒక బంగ్లా నేపథ్యంలోనే జరుగుతుంది. షూటింగ్స్ కోసం అవుట్ డోర్ కి ఎక్కువగా వెళ్లాల్సిన అవసరం లేదు. వీలైనంత వరకు ఒకే చోట సెట్స్ లలోనే షూట్ చేసేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే బడ్జెట్ కూడా తక్కువ అవుతుందంట. ఈ లెక్కన చూసుకుంటే మూవీకి డిజిటల్ రైట్స్ ద్వారానే పెట్టుబడి కంటే డబుల్ ఆదాయం వచ్చే ఛాన్స్ ఉంది. అలాగే పాన్ ఇండియా లెవల్ లోనే ఈ చిత్రం రిలీజ్ కానున్న నేపథ్యంలో కచ్చితంగా భారీ లాభాలు వస్తాయని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఏ విధంగా చూసుకున్న ప్రభాస్ ఈ సినిమా లాభాల్లో వాటా ద్వారా మిగిలిన సినిమాల కంటే ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకున్న ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఆదిపురుష్ సినిమా రైట్స్ ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ కొనుగోలు చేసి తెలుగులో రిలీజ్ చేసింది. అయితే ఆ మూవీ డిజాస్టర్ కావడంతో నిర్మాతకి చాలా నష్టం వచ్చింది. ఆ లెక్కని రాజాసాబ్ చిత్రంతో ప్రభాస్ సరిచేస్తున్నట్లుగా ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంతో మాళవిక మోహనన్ టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. నిధి అగర్వాల్, ఆషికా రంగనాథ్ కూడా హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

## వైట్ అండ్ వైట్‌లో ఇచ్చి పడేసిందిగా

కవులు కాని వారు కూడా కాళిదాసులైపోతారు ఈ అందాన్ని చూస్తే. బికినీలు స్విమ్ సూట్లు వేస్తేనే హాట్ గా ఉన్నట్టా..? అప్పుడప్పుడు తెల్ల చొక్కాల్లో కూడా అంతే వేడి పెంచేయొచ్చు అని నిరూపిస్తోంది జాన్వీ కపూర్. ఈ స్టార్ డాటర్ అందం హొయలు మతులు చెడగొడుతున్నాయ్. కెరీర్ ఆరంభం చిట్టి పొట్టి నిక్కర్లతో మతులు చెడగొట్టిన జాన్వీ కపూర్ తనకంటూ భారీ ఫాలోయింగ్ వచ్చాక మాత్రం నెమ్మదిగా ఫ్యాషన్ సెన్స్ పరంగా పరిణతితో వ్యవహరిస్తోంది. డీసెంట్



గా కనిపిస్తూనే, మాస్ ని టచ్ చేయడమెలానో చేసి చూపిస్తోంది. తాజాగా వైట్ అండ్ వైట్ లుక్ లో జాన్వీ కపూర్ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెట్టింది. సింపుల్ గా వైట్ డిజైనర్ షర్ట్ ధరించి కాంబినేషన్ బ్లాక్ జీన్స్ తో మెరిసిపోయింది ఈ బ్యూటీ. ఫ్రీస్టయిల్ లో తనలోని ఫ్యాషనిస్టా కంటెంట్ ని జాన్వీ ఎలివేట్ చేసిన తీరు ఆశ్చర్యపరిచింది. ఆ అందమైన నేరేడు కళ్లను చక్రాల్లా తిప్పుతూ హార్ట్ బీట్ ని లయ తప్పేలా చేసింది ఈ అమ్మడు. మొత్తానికి దేవర చిత్రంతో తెలుగు యువత గుండెల్ని ముక్క చెక్కలు చేయడమెలాగో ప్రాక్టికల్ గా చూపిస్తుందనే భావించాలి. ప్రస్తుతం ఈ హాట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

## అప్ కమింగ్ మోస్ట్ వాంటెడ్ వరాలు...!

సంక్రాంతి సందర్భంగా వచ్చిన నాలుగు సినిమాలు కూడా మంచి వసూళ్లు సాధిస్తూ ఉన్నాయి. నాలుగు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద గౌరవ ప్రదమైన వసూళ్లు దక్కించుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. ఇక సంక్రాంతి సినిమాల హీరోయిన్స్ విషయం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గుంటూరు కారం సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటించింది. ఆమె పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత దక్కలేదు. కేవలం గ్లామర్ డాల్‌గా మాత్రమే ఆమె కనిపించింది. హనుమాన్ లో కూడా హీరోయిన్ పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత లేదు. ఇక సైంధవ్ లో హీరోయిన్ ఉన్నట్లా.. లేనట్లా అన్నట్లుగానే ఉంది. ఇక నా సామి రంగ సినిమాలో హీరోయిన్ గా నటించిన ఆషికా రంగనాథ్ మాత్రం ఈ సంక్రాంతి ముద్దుగుమ్మల పోటీలో విజయం



సాధించినట్లు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందంతో పాటు అభినయం తో ఆషికా మెప్పించింది. అందమైన రూపంతో పాటు, పవర్ ఫుల్ యాక్టింగ్ తో మెప్పించింది. వరాలు అలియాస్ వరలక్ష్మి పాత్ర తో మెప్పించిన ముద్దుగుమ్మ ఆషికా కి ఇప్పటికే పలు ఆఫర్లు వస్తున్నాయట. టాలీవుడ్ లో త్వరలో మోస్ట్ వాంటెడ్ గా ఈ అమ్మడు నిలిచే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పలువురు దర్శక నిర్మాతలు ఇప్పటికే ఆషికా డేట్ల కోసం సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం అందుతోంది. మొత్తానికి ఆషికా ఈ ఏడాది కాకున్నా వచ్చే ఏడాది వరకు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా, స్టార్ హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో హీరోయిన్ కొరత ఉంది. ఆ కొరతను కచ్చితంగా ఆషికా వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి. సీనియర్ హీరోతో నటించినప్పటికీ ఆషికాతో జత కట్టేందుకు పలువురు యంగ్ హీరోలు ఇంట్రస్ట్ గా ఉండటం విశేషం.

గరుడ వార్త






## 'భారత్‌కు ఆయనే అత్యుత్తమ నాయకుడు'.. మోదీకి అమెరికన్ సింగర్ మద్దతు

దిల్లీ: భారత్‌కు ప్రధాని మోదీ అత్యుత్తమ నాయకుడని, తమ దేశంతో సంబంధాలు బలపడటానికి ఆయనే ప్రధాన కారణమని ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ అన్నారు. ప్రధానిగా మోదీ మరోసారి ఎన్నికవ్వాలని చాలా మంది అమెరికన్లు కోరుకుంటున్నారని తెలిపారు. ఆయన ఎన్నికతో ఇరు దేశాల సంబంధాలు మరింత బలపడతాయన్నారు.

"ప్రధాని మోదీకి అమెరికాలో మద్దతు ఎక్కువ. ఆయనే మరోసారి ప్రధానిగా ఎన్నికవ్వాలని చాలా మంది అమెరికన్లు కోరుకుంటున్నారు. భారత్‌కు ఆయనే అత్యుత్తమ నాయకుడు. 2024 ఎన్నికలు ఇరు దేశాలకూ కీలకం. వీటి ఫలితాలు భారత్–అమెరికా సంబంధాలపై ప్రభావం చూపిస్తాయి. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే నాయకులను ఎన్నుకునే బాధ్యత మనదే. భారత్‌ను ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు మోదీ కృషి చేశారు. ఆయన ప్రభుత్వం ఆధ్వర్యంలో టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో భారత్ పురోగతి సాధించింది. దేశాధ్యక్షురాలిగా, కేంద్ర మంత్రివర్గంలో మహిళలకు అవకాశం ఇచ్చి వారి నాయకత్వాన్ని ప్రోత్సహించారు. అమెరికాకు సంబంధించినంత వరకు ఆయన గొప్ప నాయకుడు. భారత్‌లో మోదీకి పోటీ లేదు. ఇరు దేశాల మధ్య సంబంధాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన మరోసారి ప్రధానిగా ఎన్నికవుతారన్న నమ్మకం ఉంది" అని మేరీ మిల్బెన్ తెలిపారు. గతేడాది జూన్‌లో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా మిల్బెన్ భారత జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. అనంతరం మన ప్రధాని పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. మరోసారి ఆగస్టులో మణిపూర్ అంశంపై ప్రధానికి మద్దతు పలికారు. అమెరికాలో ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆమె మద్దతు ప్రకటించారు.

## కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. 420 హామీలు : కేటీఆర్



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. అవి 420 హామీలు అని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. 'గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ గుల్ల అయ్యిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విఫలం అయ్యిందని అబద్ధాలు మాట్లాడించారు. అందుకే శ్వేద పత్రం విడుదల చేశాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధిని పొందుపరిచాం. గణాంకాలు, ఆధారాలతో సహా వివరించాం. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా.. రూ. 2 లక్షల రుణం తెచ్చుకోండి అని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ మాట్లాడారు. తుమ్మల నాగేశ్వర్ రావు రుణాలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే కేసులు పెట్టండి అని అంటున్నాడు. పత్రికల్లో కూడా వచ్చింది. ప్రియాంక గాంధీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెబితే, భట్టి విక్రమార్క భృతి ఇస్తామని చెప్పలేదని హరీష్ రావు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని హామీ ఇచ్చారు కానీ అది సాధ్యం కాదని మొన్న స్పష్టమైంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'కాంగ్రెస్ నోటికి ఎంత వస్తే అంత అనుకుంటూ హామీలు ఇచ్చారు. అందుకే 420 హామీలను అమలు చేసేదాకా విడిచి పెట్టం. ప్రధాని, అదానీ ఒక్కటని విమర్శలు చేసిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నేడు ఆయనతోనే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాహుల్ గాంధీ నిన్ననే అదానీని తిడితే, రేవంత్ రెడ్డి అదే సమయంలో దావోస్‌లో ఒప్పందం చేసుకున్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడిన కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసలు రంగు బయట పడుతున్నది. కేసీఆర్ ఉన్నంత కాలం అదానీ ఇక్కడ అడుగు పెట్టలేదు. కానీ కాంగ్రెస్ రాగానే ఎలా అడుగు పెడుతున్నాడని కేటీఆర్ నిలదీశారు. ఇక హరీశ్ రావు నాయకత్వంలో కార్యకర్తలంతా క్రియాశీలకంగా పని చేయడంతో గత ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించాం. ఈ సారి కూడా మెదక్‌లో గులాబీ జెండా ఎగరబోతున్నది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గత పదేళ్ళలో తెలంగాణ తరుపున గళం విప్పింది మన బీఆర్ఎస్ ఎంపీలు అనే విషయం మరచి పోవద్దు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే.

మన బలం, మన గళం, మన గులాబీ జెండా పార్లమెంట్‌లో ఉండాలి. లేకుంటే తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని. ఇదే విషయం ప్రజలకు చెప్పాలి. నిరాశ వీడాలి. బయటికి రావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలి



కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22వ తేదీన సెలవుదినంగా ప్రకటించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు దేవుడి అక్షింతల కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, రామ మందిర నిర్మాణ నిధి సేకరణలో తెలంగాణ అగ్రభాగాన ఉందన్నారు. అక్షింతల్లో రకాలు వుండవని, రేషన్ బియ్యం అని వక్రీకరించడం తగదని హితవుపలికారు. దైవ కార్యాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ వాళ్లు కోరితే బాసుమతి బియ్యం పంపుతామని బండి సంజయ్ అన్నారు.

## రాముడుతో రాజకీయాలు చేయడం బీజేపీ ఆపాలి



మహబూబ్ నగర్ జిల్లా: రాముడుతో రాజకీయాలు చేయడం బీజేపీ ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలం కొల్లూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. రాముడు అందరివాడని.. దేవుడి ఫొటోతో రాజకీయం చేయడం బీజేపీకి తగదన్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పీఠాధిపతులే వ్యతిరేకించారని తామెంత అన్నారు. రాముల వారి అక్షింతల పేరుతో కొంతమంది బియ్యం సంచులు ఇచ్చి అయోధ్య అక్షింతలుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల తిరస్కరణకు గురైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు అహంకార పూరితంగా మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వద్దంటూ హైకోర్టులో ఫీల్ వేశారని.. ఒకవేళ వారు ఉచిత బస్ సౌకర్యం వద్దనుకుంటే టికెట్ తీసుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్‌పై దర్యాప్తు



హైదరాబాద్: ఎట్టకేలకు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వచ్చిన బెదిరింపు కాల్స్ వ్యవహారంలో మంగళ్‌హాట్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొన్ని రోజులుగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కొంతమంది ఫోన్ చేస్తూ శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తే చంపుతామంటూ బెదిరించారు. ఇదే విషయమై రాజాసింగ్ నగర కమిషనర్‌తోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గత రెండు రోజుల క్రితం సైతం ఓ వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్‌లోనే చంపుతానంటూ చాలెంజ్ చేయడంతో అదే విషయాన్ని రాజాసింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ అంశంపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసి వాటిపై ఆరా తీస్తున్నారు.



## బతుకమ్మ చీరల బిల్లు పెండింగేంది సామీ..?

హైదరాబాద్ : చేతికి మైకు చిక్కితే చాలు.. వెనుకా ముందు చూసుకోకుండా నీతులు చెప్పే అలవాటున్న మాజీ మంత్రి కేటీఆర్.. చేతిలో ఉన్న పవర్ చేజారిన తర్వాత మరింత ఎక్కువైంది. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం కుదురుకోవటానికి కనీసం మూడు నెలల సమయం పడుతుందన్న చిన్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా అదే పనిగా విమర్శలు గుప్పించే తీరు వెగటు పుట్టేలా మారిందంటున్నారు. ఈ విషయం కాదు ఆ విషయం కాదు.. ప్రతి అంశంలోనూ వేలెత్తి చూపే తీరును కేటీఆర్ ఎంత త్వరగా మార్చుకుంటే అంత మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ సర్కారు లోపాల్ని చూపించే ఆయన.. తమ తొమ్మిదిన్నరేళ్ల పాలనకు సంబంధించి వెలుగు చూస్తున్న సిత్రాలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. బతుకమ్మ చీరల పేరుతో కేసీఆర్ సర్కారు చేసుకున్న ప్రచారం అంతా ఇంతా కాదు. చేనేత కార్మికుల కష్టంతో తయారు చేయించే బతుకమ్మ చీరల బిల్లుల్ని నెలల తరబడి పెండింగ్ ఉంచటం ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. సంక్షోభంలో కొట్టుమిట్లాడే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవటానికి బతుకమ్మ చీరల ఆర్డర్ ఇవ్వటం ద్వారా వారికి చేయూతగా నిలుస్తున్నట్లుగా బిల్డప్ ఇవ్వటం తెలిసిందే. తాజాగా బయటకు వచ్చిన పచ్చి నిజం ఏమంటే.. బతుకమ్మ చీరలకు సంబంధించి గత బీఆర్ఎస్ సర్కారు రూ.220 కోట్ల బకాయిల్ని చెల్లించలేదు. భారీగా పెండింగ్ లో ఉన్న బకాయిల కారణంగా.. చేనేత కార్మికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. బకాయిల్ని చెల్లిస్తామని అప్పటి మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ చెప్పినప్పటికీ.. మాటలే తప్పించి చేతల్లో చూపించలేని పరిస్థితి. ఇలాంటి వేళ.. కేసీఆర్ సర్కారు నాటి బకాయిల్ని నేటి రేవంత్ సర్కారు తీరిస్తే.. ఆర్థిక ఇబ్బందుల నుంచి కాస్తంత బయటపడే వీలుందని చెబుతున్నారు. ఆదర్శాలు దంచే కేటీఆర్.. బతుకమ్మ చీరల బిల్లులు క్లియర్ చేయించాలన్న ఆలోచన లేకపోవటం ఏమిటి కేటీఆర్? అన్న ప్రశ్న పలువురి నోట వినిపిస్తోంది.

## అద్దంకిని పక్కన పెట్టిన కారణమిదేనా ?



హైదరాబాద్ : ఎంఎల్‌ఏ కోటాలో ఎంఎల్సీల జాబితా నుండి చివరి నిముషంలో అద్దంకి దయాకర్ ను కాంగ్రెస్ అధిష్టానం పక్కనపెట్టేసింది. మొదట్లోనేమో అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లు ఖరారైనట్లు విపరీతమైన ప్రచారం జరిగింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ ను అద్దంకి త్యాగం చేశారు. దానికి ప్రతిఫలంగా ఎంఎల్సీ ఇస్తోందనే ప్రచారం పెరిగిపోయింది. దాంతో నేతలు, క్యాడర్ కూడా ఫుల్లుగా హ్యాపీ ఫీలయ్యారు. అయితే చివరినిముషంలో అద్దంకి ప్లేసులోకి మహేష్ కుమార్ గౌడ్ చేరారు. ఎంఎల్‌ఏ కోటాలో ఎంఎల్సీ అభ్యర్ధులుగా బల్మూరి, గౌడ్ పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. చివరి నిముషంలో అద్దంకిని ఎందుకు తప్పించారనే విషయంలో ఊహాగానాలు పెరిగిపోతున్నాయి. అద్దంకిని తప్పించినందుకు రెండు మూడు కారణాలను పార్టీవర్గాలు ప్రస్తావిస్తున్నాయి. అవేమిటంటే అద్దంకికి పీసీసీ అధ్యక్ష పదవి రాబోతోందట. అలాగే కేబినెట్ ర్యాంకుండే కార్పొరేషన్ పదవిని ఇవ్వబోతున్నారన్నది రెండోది. ఇక తొందరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ నుండి పోటీ చేయబోతున్నారన్నది మూడోది. నిజానికి ఎంఎల్సీతో పోల్చుకుంటే క్యాబినెట్ ర్యాంకు తో కార్పొరేషన్ పదవి అన్నది చిన్నదనే అనుకోవాలి. ఇక పీసీసీ అధ్యక్ష పదవి అన్నది అధికారంలో ఉన్నపుడు ఆ పదవికి పెద్దగా గుర్తింపుండదు. పైగా రేవంత్ లాంటి దూకుడు స్వభావం ఉన్న నేత ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పీసీసీ అధ్యక్షపదవి కేవలం అలంకారప్రాయమే అవుతుంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇదే పీసీసీ అధ్యక్ష పదవికి బాగా ప్రాముఖ్యత ఉంటుంది. నిర్ణయాలు అధిష్టానంతో చర్చించిన తర్వాతే తీసుకోవాల్సొచ్చినా అమలు చేయాల్సింది పీసీసీ అధ్యక్షుడే కాబట్టి బాగా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఇక వరంగల్ పార్లమెంటులో పోటీ విషయం తీసుకుంటే ఆ సీటిచ్చి అతను గెలుచుకుంటే అది మంచిదే. ఎందుకంటే... ఎమ్మెల్సీ కంటే అదే బెటర్. పైగా రేవంత్ కుఅనుకూలుడు అయిన దయాకర్ ఢిల్లీలో తన మనిషిగా నిత్యం అందరితో టచ్ లో ఉండే అవకాశం ఉంటుంది.

## కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగిస్తే అంతే సంగతులు..!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులు కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు పరిధిలోకి వెళతాయనే వార్తలు ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. లేదంటే భవిష్యత్ తరాలు ఇబ్బంది పడాల్సి వస్తోందని అభిప్రాయ పడ్డారు.

**నీళ్ల కోసం** : తెలంగాణ ఉద్యమం చేసిందే నీళ్ల కోసం అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. కేఆర్ఎంబీకి సంబంధించి గతంలో తమపై కూడా ఒత్తిడి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. 264 మెగా వాట్స్ విద్యుత్ శ్రీశైలంలో ఉత్పత్తి చేసి సాగర్‌కు నీటిని విడుదల చేయాలని తాము కోరామని వివరించారు. ఆ సూచనలు పాటించకుంటే ప్రాజెక్టులు విలీనం చేయమని తేల్చి చెప్పామని వివరించారు.

**భారీ నష్టం :** KRMBకి ప్రాజెక్టులు అప్పగిస్తే రాష్ట్రానికి భారీ నష్టం జరుగుతుందని హరీశ్ రావు అంటున్నారు. హైడల్ పవర్ జనరేషన్‌లో స్వయం ప్రతిపత్తిని కోల్పోతామని వివరించారు. సాగర్ ఆయకట్టు దెబ్బ తింటుందని తెలిపారు. హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందని వివరించారు. పాలమూరు రంగారెడ్డి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టుల కోసం అడగాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అన్యాయం జరిగింది :** బీజేపీ, కాంగ్రెస్ గతంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశాయని హరీశ్ రావు గుర్తుచేశారు. ఏడు మండలాలు ఏపీలో కలిపి సీలేరు ప్రాజెక్టును పక్క రాష్ట్రానికి అప్పగించారని ధ్వజమెత్తారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టాయని విరుచుకుపడ్డారు. పోతిరెడ్డిపాడు ద్వారా గోదావరి డెల్టాకు నీటిని తరలిస్తే సాగర్ ఆయకట్టు దెబ్బ తింటుందని తెలిపారు. ప్రాజెక్టులు KRMB చేతిలోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు.

**నిపుణుల సలహా తీసుకోండి :** కాళేశ్వరంలో మేడిగడ్డ నుంచి ఇప్పుడు కూడా నీరు తెచ్చుకోవచ్చని హరీశ్ రావు సూచించారు. గోదావరిలో 5 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని వివరించారు. ఆ నీటిని లిఫ్ట్ చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. కాళేశ్వరం పంప్ హౌజుల్లో మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ సిస్టంలో నడుపుతున్నారని తెలిపారు. దీని వల్ల మోటార్లు త్వరగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని మోటార్లు నడపాలని సూచించారు. రాష్ట్రానికి జాతీయ ప్రాజెక్ట్ తీసుకొస్తామని ఢిల్లీ వెళ్లి, ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## ప్రేమించలేదని మైనర్ అమ్మాయిపై బాలుడి కిరాతకం.. హైదరాబాద్‌లో దారుణం

హైదరాబాద్ : ప్రేమించాలంటూ అమ్మాయిలను యువకులు వేధింపులకు గురిచేసిన ఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి. అంతేకాకుండా ప్రేమించని కారణంగా అమ్మాయిల ప్రాణాలు కూడా తీస్తున్నారు ప్రేమోన్మాదులు. కొందరు తాము ప్రేమించామని చెప్పుకుంటూ.. అందుకు నిరాకరించిన అమ్మాయిలపై దాడి చేయడమే కాకుండా.. ఆపై తమ ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నగరంలో చోటు చేసుకుంది. అంబర్‌పేటలో దారుణం జరిగింది. మైనర్ అమ్మాయిపై ఓ బాలుడు కత్తితో దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. అంతేకాకుండా బాలుడు కూడా ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. ప్రేమించాలని మైనర్ అమ్మాయిపై బాలుడు కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన మరొక అమ్మాయిపై కూడా బాలుడు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. మైనర్ అమ్మాయిలపై దాడి తర్వాత తీవ్ర భయాందోళనకు గురైన సదరు బాలుడు ఆపై బలవన్మరణానికి పాల్పడ్డాడు. విద్యానగర్ రైల్వే ట్రాక్‌పై పడుకుని బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన అమ్మాయిలు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com